Follow: @ANNTELUGU
09-07-2026
# మహా పత్రిక
గురువారం, హైదరాబాద్   సంపుటి- 23   సంచిక- 185   పేజీలు-08   వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI   REGISTERED NUMBER: APTEL/2003/09316   WWW.EPAPER.MAHAADAILY.COM



## ట్యాపింగ్ కేసులో ఏ-1గా కేసీఆర్ ?

**క్లైమాక్స్ కు కేసు.. ఛార్జిషీట్ కు రంగం సిద్ధం**

**హైదరాబాద్, మహా** తెలంగాణ పాటిక్స్ లో రెండేళ్ళుగా ఉత్కంఠ రేపుతున్న ఫోన్ ట్యాపింగ్ కేసు ఇప్పుడు క్లైమాక్స్ కు చేరుకుంది. ఈ కేసుకు సంబంధించి ప్రత్యేక దర్యాప్తు బృందం మరో కీలకమైన అనుబంధ చార్జిషీట్ దాఖలు చేసేందుకు సర్వం సిద్ధం చేసింది. ప్రాథమిక దర్యాప్తులో కేవలం కింది స్థాయి అధికారులు, పోలీసు ఉన్నతాధికారుల చుట్టూనే తిరిగిన ఈ కేసు.. తాజా చార్జిషీట్ తో నేరుగా రాజకీయ అగ్రనాయకత్వాన్ని తాకబోతుండటం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఈసారి గత ప్రభుత్వానికి చెందిన ముగ్గురు అత్యంత కీలక వ్యక్తుల పేర్లను నిందితుల జాబితాలో చేర్చబోతున్నట్లు సమాచారం. సిట్ సిద్ధం చేసిన తాజా నివేదిక ప్రకారం.. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తో పాటు గత ప్రభుత్వంలో చక్రం తిప్పిన మరో ఇద్దరు ఉన్నత స్థాయి నేతల పేర్లు ఈ అనుబంధ **మిగతా 2వ పేజీలో**

**టాప్ న్యూస్**



### మూడు నెలలు నన్ను మంత్రిని చేయండి

హరీష్ సంచలన ప్రతిపాదన

02



### హరీశ్ కాంగ్రెస్‌లోకి వస్తావా

కూలిపోయే ప్రాజెక్టు కట్టి కూతలా?

: జగ్గారెడ్డి ఫైర్

02



### అప్పుడు ఆలయం వద్దని .. ఇప్పుడు రాజకీయాలా?

కంగనా రనౌత్ ఫైర్


02



### స్టాక్ మార్కెట్లలో రక్తపాతం

- ఒక్కరోజే రూ. 8 లక్షల కోట్లు ఆవిరి

02




### ఇరాన్‌తో డీల్ క్లోజ్

- ట్రంప్ సంచలన ప్రకటన
- చర్చలు కొనసాగించడం సమయం వృథా అని వ్యాఖ్య
- ఇరాన్‌పై అమెరికా భారీ ప్రతీకార దాడులు

03

### ఇండోపసిఫిక్ ప్రాంతంలో సరికొత్త భౌగోళిక రాజకీయం




02


# వస్తాడయ్యా.. రామయ్య

| ఏపీ పాలిటిక్స్‌లో ఎన్టీఆర్ ఎంట్రీకి టైమ్ ఆసన్నమైందా? | 'గ్లోబల్ స్టార్' రాక పై పెరుగుతున్న ఉత్కంఠ! | ఎప్పటికైనా ఎన్టీఆర్ సీఎం అవుతారంటున్న అభిమానులు |
|---|---|---|

- తమిళనాట విజయ్ విజయం తర్వాత తారక్ పై ఒత్తిడి
- తాజాగా నక్షత్రాలు, జాతకాలు చెబుతూ స్టార్ బాగుందంటున్న జ్యోతిష్యులు
- 2009లోనే స్టార్ క్యాంపెయినర్ గా ఖాకీడ్రెస్ తో అదరగొట్టిన ఎన్టీఆర్
- నాటి నుండీ తారక్ ఎంట్రీపై చర్చోపచర్చలు..
- ప్రస్తుత ఏపీ రాజకీయాల్లో 'స్పేస్' ఉందా?
- బాబు వారసుడిగా స్థిరపడ్డ లోకేష్.. రెడ్ బుక్ తో మాస్ లీడర్ ఇమేజ్



(హైదరాబాద్ మహా) : "రక్తంలోనే ఉంది రాజకీయం. వారసత్వపు హోరులో, ప్రజల కోరులో.. కాలం పిలుస్తోంది, గతం గుర్తుచేస్తోంది. వేచి చూడండి.. వస్తాడయ్యా మన రామయ్య! అంటూ అభిమానులు ఎన్టీఆర్ మనవడు తారకరాముడి రాజకీయ అరంగేట్రం కోసం ఎదురుచూస్తున్నారు. ఎన్టీఆర్ రాజకీయ అరంగేట్రానికి సంబంధించిన ప్రచారం ఒకటి, రెండు కాదు.. ఇరవై ఏండ్లుగా జరుగుతూనే ఉంది. అయినా ఆయన పాలిటిక్స్ పై మౌనమే సమాధానంగా ముందుకువెళ్తున్నారు. తారక్ ఎప్పుడు వచ్చినా, ఆయన రాక మాత్రం ఒక చారిత్రక ఘట్టం కావడం ఖాయం. తెలుగు చలనచిత్ర పరిశ్రమలో 'యంగ్ టైగర్'గా, అభినయ సామ్రాజ్యానికి చక్రవర్తిగా వెలుగొందుతున్న ఎన్టీఆర్ పేరు, గత రెండు దశాబ్దాలుగా ఏపీ [illegible]



సింగరేణిపై ప్రేముంటే

## గోదావరి లోయ బ్లాకులన్నీ కేటాయించాలి

**తాడిచెర్ల కొత్త కేటాయింపు కాదు.. పాతదానికే అనుమతి**

- ప్రైవేట్ వారికి ఇచ్చిన బ్లాకులను వెనక్కి తీసుకుని సింగరేణికి ఇవ్వాలి
- గిరిజన ప్రాంతాల్లో బొగ్గు బ్లాకుల వేలం చట్టవిరుద్ధం
- కేంద్రం తీరుపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫైర్

02

**హైదరాబాద్, మహా :** సింగరేణి కాలరీస్ సంస్థకు తాడిచెర్ల2 కోల్ బ్లాక్ కేటాయింపుపై కేంద్ర ప్రభుత్వం వాస్తవాలను మరుగున పరిచి, తప్పుడు ప్రచారం చేస్తోందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ధ్వజమెత్తారు. సింగరేణికి 2013లో కేటాయించిన తాడిచర్ల 2 బ్లాకును మళ్లీ సింగరేణికి కేటాయిస్తున్నట్టు కేంద్ర బొగ్గు గనుల శాఖామంత్రి కిషన్ రెడ్డి ప్రకటించడాన్ని ఆయన ఖండించారు. ఇప్పటికే కేటాయించిన తాడిచర్ల2 బ్లాక్ కు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి మంజూరు చేసింది కేవలం లీజు మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. 2013లో కేటాయించిన తాడిచర్ల2 బ్లాక్ ను ఇప్పటివరకు లీజు ఇవ్వకుండా కేంద్రం జాప్యం చేసిందని అన్నారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి దీనిపై కేంద్రానికి లేఖలు రాస్తున్నామని చెప్పారు. ప్రజా ప్రభుత్వ కృషి వల్లనే కేంద్రం లీజుకు అనుమతి ఇచ్చిందని అన్నారు. ప్రజా భవన్ లో బుధవారం మధ్యాహ్నం నిర్వహించిన మీడియా సమావేశంలో సింగరేణికి 2010 నుంచి 2012 వరకు కేంద్ర బొగ్గు శాఖకు చేసిన విజ్ఞప్తులపై స్పందిస్తూ నాటి కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ 2013 సెప్టెంబర్ 16న తాడిచర్ల2 బొగ్గు బ్లాక్ ను సింగరేణి సంస్థకు కేటాయించిందన్నారు. కేటాయింపు లేఖలో స్పష్టంగా ఈ బ్లాకులో గిరిజన భూములు ఉన్నందున **మిగతా 2వ పేజీలో**




## కవిత.. ఎందుకిలా?

అనుచరుల్లో అంతర్మథనం

పార్టీకి వరుస సమస్యలు

02



ఎమ్మెల్యే పాయల్ శంకర్ భూకబ్జాలపై

## చట్టరీత్యా చర్యలు తీసుకోండి

- కలెక్టర్ , ఎస్పీలకు కంది శ్రీనివాస రెడ్డి ఫిర్యాదు
- అసైండ్ స్థలంలో 5 కోట్ల విలువైన 11 ప్లాట్లను భార్య పేరు పై అక్రమ రిజిస్ట్రేషన్
- కంది శ్రీనివాస రెడ్డి లేఖతో పాటు ఆధారాలను అందించిన కాంగ్రెస్ శ్రేణులు

02



# 3 నెలలు నన్ను మంత్రిని చేయండి ..నీరు పారించి చూపిస్తా

**మాజీ మంత్రి హరీశ్ రావు**



**హైదరాబాద్, మహా :** మూడు నెలలు తనకు నీటి పారుదల శాఖ మంత్రిగా అవకాశం ఇస్తే ఎల్లంపల్లికి నీళ్లు తెచ్చి చూపిస్తామని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై తెలంగాణ భవన్‌లో ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. ''మూడు నెలలు మంత్రిగా అవకాశం ఇవ్వండి. కన్నేపల్లి మోటార్లు ఆన్ చేస్తాం. ఎల్లంపల్లికి నీళ్లు తెస్తాం. ఒకవేళ తేలేకపోతే శాశ్వతంగా రాజకీయాల నుంచి వైదొలుగుతా. నాకు పదవులు కొత్త కాదు. 13 ఏళ్లు మంత్రిగా చేశా'' అని హరీశ్‌రావు అన్నారు.

**తుమ్మడిహట్టి పేరుతో.. తిన్నారు**

తుమ్మిడి హట్టి పేరుతో కాంగ్రెస్ నేతలు రూ.2,328 కోట్లు తిన్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. ''తుమ్మిడిహట్టిని 152 మీటర్ల ఎత్తులో నిర్మించేందుకు మహారాష్ట్ర అనుమతి ఇచ్చిందని చెప్పారు. ఒకవేళ అనుమతి ఇచ్చింది నిజమే అయితే.. రేవంత్‌రెడ్డి ఆ ఒప్పందాన్ని బయటపెట్టాలి. ఆ ఒప్పందాన్ని బయట పెడితే రాజీనామా చేస్తా. వ్యాప్కోస్‌ను చెఫ్‌తో పోలుస్తూ రేవంత్‌రెడ్డి మాట్లాడారు.. అసలు వ్యాప్కోస్‌ను తెచ్చిందే కేంద్రంలోని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం. ఇప్పుడు ఆయన కూడా వ్యాప్కోస్‌నే ఆశ్రయించారు. దేవాదుల ప్రాజెక్టు మోటార్లు ఆన్ చేయట్లేదు. నీళ్లు నింపుకొనే అవకాశం ఉన్నా ప్రభుత్వం నింపట్లేదు. వరంగల్ జిల్లాలో 90శాతం చెరువులు ఎండిపోయాయి. గురుదక్షిణ చెల్లించేందుకే రేవంత్‌రెడ్డి నీళ్లను వదులుతున్నారు. నీళ్లు ఉండి కూడా లిఫ్ట్ చేయకపోవడం నేరపూరిత నిర్లక్ష్యం. మీ నేరపూరిత నిర్లక్ష్యానికి ఉరి తీసినా తప్పు లేదు. నిన్న రేవంత్ ప్రసంగంలో సొల్లు తప్ప ఒక్క నిజం కూడా లేదు. తుమ్మిడిహట్టి నిర్మాణానికి మేం అన్ని ప్రయత్నాలు చేశాం. తుమ్మిడిహట్టి నుంచి ప్రాజెక్టును కావాలని మార్చలేదు. అక్కడ నీటి లభ్యత తక్కువగా ఉందని కేంద్రమే లేఖ రాసింది. సీఎం రేవంత్‌రెడ్డి తీరు.. దొంగే దొంగ అన్నట్టుగా ఉంది'' అని హరీశ్‌రావు విమర్శించారు.



# ఎమ్మెల్యే పాయల్ శంకర్ భూకబ్జాలపై చట్టరీత్యా చర్యలు తీసుకోండి

**ఆదిలాబాద్ :** ఆదిలాబాద్ లో భూ కబ్జాలకు పాల్పడుతున్న స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్ కంది శ్రీనివాస రెడ్డి ఒక లేఖ ద్వారా కలెక్టర్ ఎస్పీని కోరారు. బుధవారం ఆత్మ చైర్మన్ గిమ్మ సంతోష్ రావుతో పాటు పలువురు కౌన్సిలర్లు కాంగ్రెస్ నాయకులు జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్ లను కలిసి ఫిర్యాదు చేసారు.ఆదిలాబాద్ పట్టణంలోని బట్టి సావర్ గామ్ శివారులో గల సర్వేనెంబర్ 72/3 అసైన్డ్ భూమిలో స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ తన భార్య పాయల్ ఉమ పేరు మీద 5 కోట్ల విలువైన 11 ప్లాట్లను ఎన్వోసీ రద్దు చేసి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించారన్నారు. ఇదే విషయమై ఈనెల 7న మంగళవారం ప్రముఖ దినపత్రిక లో శ్రీమతికి ప్లాట్ల బహుమతి పేరుతో కథనం కూడా ప్రచురితమైందన్నారు. ఈ ప్లాట్ లకు సంబంధించిన అక్రమ రిజిస్ట్రేషన్ ల డాక్యుమెంట్ లను సైతం ఫిర్యాదు తో జత చేసామన్నారు. వెంటనే ఈ భూకబ్జా పై దర్యాప్తు జరిపించి వెంటనే చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు.అలాగే అట్టి రిజిస్ట్రేషన్ ను క్యాన్సిల్ చేయాలని కోరారు. అలాగే 72/3 సర్వేనంబర్ లో నూతన కలెక్టర్ భవన సముదాయానికి కేటాయించిన స్థలంలో కొందరు కబ్జాకు పాల్పడ్డారని దీనిపై కలెక్టర్ దర్యాప్తు జరిపించి కబ్జాకు గురైన స్థలాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవాలని కోరారు. ఇదే విషయాన్ని కంది శ్రీనివాస రెడ్డి ..సీయం రేవంత్ రెడ్డి , ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు , రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి దృష్టికి సైతం తీసుకువెళ్లనున్నారని తెలిపారు. కబ్జాలపై చర్యలు చేపట్టకపోతే కంది శ్రీనివాస రెడ్డి నేతృత్వంలో కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని అన్నారు. కలెక్టర్ ఎస్పీని కలసినవారిలో కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఇజ్జగిరి సంజయ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఖిజర్ పాషా, కౌన్సిలర్లు తుమ్మల అన్నపూర్ణ , మహబూబ్, నాయకులు బండారి సతీష్ ,శాంతన్ రావు , రాషీద్,మంచాల మల్లయ్య ,మంగేష్ ,అర్బాజ్, గొర్ల రాము యాదవ్, బూర్ల శంకరయ్య, పర్వేజ్, అశోక్, అల్చెట్టి నాగన్న , గుడిపల్లి నగేష్ , దర్శనాల అశోక్, దేరా కృష్ణా రెడ్డి తదితరులన్నారు.

# అప్పుడు ఆలయం వద్దని .. ఇప్పుడు రాజకీయాలా?

**కంగన్నా రనౌత్ ఫైర్**

**మహా :** అయోధ్య రామాలయం విరాళాల చోరీ అంశాన్ని ఆధారంగా చేసుకుని కాంగ్రెస్ రాజకీయ లాభం పొందాలని చూస్తోందని బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ మండిపడ్డారు. ఇన్నేళ్లుగా రామాలయ నిర్మాణాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన కాంగ్రెస్.. ఇప్పుడు ఈ విధంగా వ్యవహరించడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రదర్శించే ద్వంద్వ వైఖరి, అసలు రంగు గురించి హిమాచల్ ప్రదేశ్‌తో పాటు దేశ ప్రజలందరికీ బాగా తెలుసని కంగన వ్యాఖ్యానించారు.

# కవిత.. ఎందుకిలా?

**అనుచరుల్లో అంతర్మథనం**
**పార్టీకి వరుస సమస్యలు**



**హైదరాబాద్, మహా :** పార్టీ పెట్టిననాటి నుండి కవితను వరుస సమస్యలు చుట్టుముడుతున్నాయి. పేరుకు సంబంధించి అనుమతి రాకముందే హడావుడిగా ప్రకటించి, తర్వాత ఆ పేరును కాపాడుకోవడానికి పడుతున్న తంటాలు పార్టీవర్గాలను అంతర్మథనానికి గురిచేస్తున్నాయి. పార్టీ పెట్టకముందే అనేక అంశాలను, ప్రధాన సమస్యలను ప్రస్తావించి.. ధైర్యంగా పోరాడి ఆకర్షించిన కవిత పార్టీ ప్రకటన నాటినుండే తడబాటు మొదలైందన్న చర్చ స్పష్టంగా పార్టీలో కనబడుతోంది. పార్టీ ప్రకటన నాటినుండే వ్యూహలోపం స్పష్టంగా కనబడుతోందని, గడచిన రెండు దశాబ్దాల కాలంలో అనేకపార్టీలు తెలుగురాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా రాగా, కవిత పార్టీ సమస్యలు రాజకీయవర్గాలను ఆశ్చర్యపరుస్తున్నాయి. పార్టీ ప్రకటనకు ముందున్న హడావుడి ఇపుడు లేకపోగా, కవిత ప్రకటించిన తెలంగాణ రక్షణసేనపై వేయికి పైగా అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఇవన్నీ ఊహించలేదా.. లేక ఏదైనా హామీతో ముందుకు దూకారా? కవిత రాజకీయ వ్యూహం హిట్టవుతుందా? ఇదే పేరు కోపం చివరిదాకా పట్టుబడి చివరిదాకా రాకపోతే.. క్యాడర్ లో మరింత అయోమయం రాదా? అన్నచర్చలు సాగుతున్నాయి. పార్టీపేరుపై సాంకేతిక ఇబ్బందులు త్వరగా తెంచుకుని, ప్రజాక్షేత్రంలో క్యాడర్ కు, ప్రజలకు స్పష్టతనిస్తూ ముందుకు సాగితేనే పార్టీ మరింత బలపడుతుందన్న సూచనలు ఆ పార్టీ నేతలకు అందుతున్నాయి.

# వస్తాడయ్యా..రామయ్యా

(మొదటి పేజీ తరువాయి)



రాజకీయాల్లో ఒక శక్తివంతమైన 'ప్రతిధ్వని'లా వినిపిస్తూనే ఉంది. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోయిన నేపథ్యంలో, తారక్ రాజకీయ ప్రవేశంపై మరోసారి ఊహాగానాలు ఊపందుకున్నాయి. అభిమానుల ఆకాంక్షలు, ప్రస్తుత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో మహాపత్రిక బిగ్ స్టోరీ.

**అభిమానుల ఆశలు**

సుమారు 20 ఏళ్ల క్రితం, 2009 ఎన్నికల్లో టీడీపీ తరఫున ప్రచార రథాన్ని నడిపి, ఆ ఉద్వేగభరిత ప్రసంగాలతో తెలుగు ప్రజలను ఉర్రూతలూగించిన తారక్, తనలోని 'వాగ్ధాటి'ని అప్పుడే నిరూపించుకున్నారు. నాటి నుండి నేటి వరకు, తారక్ వెండితెరపై ఎంతటి అద్భుతాలు సృష్టిస్తున్నా, ఆయనలోని నాయకత్వ లక్షణాలను చూసిన అభిమానులు మాత్రం ఎప్పుడూ ఒకటే కోరుకుంటున్నారు: "ఎన్టీఆర్.. మళ్ళీ రాజకీయాల్లోకి రావాలి. రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, తారక్ కేవలం ఒక నటుడు మాత్రమే కాదు, ఎన్టీఆర్ తాతగారి రూపం, గాంభీర్యం, వాగ్ధాటి ఆయనలో పుష్కలంగా ఉన్నాయి. అందుకే, క్లిష్ట సమయంలో పార్టీని నడిపించే 'సారథి'గా అభిమానులు తారక్‌ను చూస్తున్నారు. 2009లో ఎన్టీఆర్ తో కలిసి క్యాంపెయిన్ టీంలో ఉన్న యంగ్ లీడర్ రేవంత్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రిగా ఉండగా, తారక్ అరంగేట్రం, వ్యూహం, సమీకరణాలపై ఆసక్తి నెలకొంది.

**ప్రస్తుత ఏపీ రాజకీయాల్లో 'స్పేస్' ఉందా?**

ప్రస్తుత ఏపీ రాజకీయాల్లో యువ నాయకత్వం వేగంగా దూసుకుపోతోంది. యువమంత్రిగా, తనదైన శైలిలో పరిపాలనాపరంగా, రాజకీయంగా పరిణతి చెందుతూ రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇన్వెస్ట్ మెంట్స్ తో బాబు స్టైల్ పరిపాలన, రెడ్ బుక్ తో బాబులో లేని మాస్ యాంగిల్ ను లోకేష్ ఏపీ పాలిటిక్స్ లో భిన్నంగా నిలుపుతున్నాయి. క్లాస్ తో పాటు మాస్ ను కూడా మెప్పించగల సమర్థతను లోకేష్ పుణికిపుచ్చుకున్నారు. చంద్రబాబు ప్లస్ బాలయ్యగా లోకేష్ రూపాంతరం చెందారని అభిమానులు, క్యాడర్ సంతోషపడుతున్నారు. ఇక పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎంగా, తనకంటూ ఒక బలమైన రాజకీయ ముద్ర వేస్తూ, వ్యూహాత్మక అడుగులు వేస్తున్నారు.

**తారక్ మౌనం.. వ్యూహమా? లేక అకర్షణా?**

తారక్ చాలా కాలంగా రాజకీయాలకు దూరంగా ఉంటూ, తన సినిమా కెరీర్‌పైనే పూర్తి దృష్టి సారిస్తున్నారు. 'ఆర్ఆర్ఆర్' వంటి అంతర్జాతీయ స్థాయి విజయాలతో, ఇప్పుడు తారక్ ఒక 'గ్లోబల్ ఐకాన్'గా ఎదిగారు. తన రాజకీయ ప్రవేశంపై వచ్చే ప్రశ్నలకు తారక్ ఎప్పుడూ ఒక పరిణతి చెందిన సమాధానమే ఇస్తుంటారు. ఆయన ప్రస్తుతానికి సినిమాలకే అంకితమైనా, తెలుగు జాతి పట్ల ఆయనకున్న గౌరవం, తాతగారిపై ఆయనకున్న ప్రేమ ఎప్పటికీ తగ్గలేదని చెబుతారు.

**సమయం ఆసన్నమైందా?**

రాజకీయం అనేది కేవలం ఆవేశంతో చేసేది కాదు, అది అత్యున్నతమైన 'సమయస్ఫూర్తి'తో కూడుకున్నది. తారక్ ఎప్పుడు వస్తారనేది ఆయన వ్యక్తిగత నిర్ణయంపైనే ఆధారపడి ఉన్నప్పటికీ, రాజకీయ విశ్లేషకులు మాత్రం "తారక్ రాక ఇప్పుడు అవసరమా లేక భవిష్యత్తులో అవసరమా?" అనే కోణంలో చర్చిస్తున్నారు. తమిళనాట విజయ్ అరంగేట్రంలోనే విజయం సాధించి సీఎం అయిన తర్వాత తారక్ పై ఒత్తిడి పెరిగింది. నిజానికి సౌత్ ఇండియన్ పాలిటిక్స్ లోనే ఎన్టీఆర్ ను మించిన అర్హత మరే స్టార్ కు లేదు. అదే అభిమానులను తొలిచేస్తోంది. నిజానికి, తారక్ రాజకీయాల్లోకి వస్తే ఏపీ రాజకీయాల్లో ఒక కొత్త శకం మొదలవుతుందనడంలో సందేహం లేదు. ఆయన మాటల్లోని పదును, ప్రజలను కట్టిపడేసే ఆయన ఆకర్షణశక్తి పాలిటిక్స్‌కు కొత్త కళను తీసుకువస్తాయి. అభిమానుల గుండె చప్పుడు తారక్ వింటారా? ఎప్పుడైనా పక్కా అని నమ్మే అభిమానుల ఆశలు నెరవేరుతాయా? అన్నది వేచి చూడాలి. ప్రస్తుతానికి తారక్ తన సినిమా ప్రయాణంలో విజయకేతనం ఎగురవేస్తూ, తెలుగు వారి గర్వాన్ని ప్రపంచ వేదికపై చాటుతున్నారు. ఏది ఏమైనా, తారక్ ఎక్కడ ఉన్నా, ఎలా ఉన్నా.. తెలుగు వారి గుండెల్లో ఆయన 'ముద్ర' చెరిగిపోనిది.

**తారక్ సీఎం కావడం ఖాయం**

జూనియర్ ఎన్టీఆర్ గురించి ప్రముఖ జ్యోతిష్యుడు వేణుస్వామి మాట్లాడుతూ తారక్ మఖా నక్షత్రంలో జన్మించాడని, ఈ నక్షత్రంలో జన్మించిన వారి స్టార్ బాగుంటుందని, రాజకీయంలో రాణిస్తారని తెలిపారు. జయలలిత కూడా అదే నక్షత్రంలో జన్మించినట్టు పేర్కొన్నారు. ఎన్టీఆర్ యోగ పురుషుడు అన్నారు. జూనియర్ ఎన్టీఆర్ భవిష్యత్తులో ముఖ్యమంత్రి అవుతాడని వేణుస్వామి జోస్యం చెప్పారు. తారక్ పట్ల అభిమానులకు ఉన్న అపారమైన ప్రేమను, ఆయన రాక కోసం వారు ఎదురుచూస్తున్న నిరీక్షణను ప్రతిబింబించడానికి. వెండితెరపై 'తారకుడు'గా గర్జించినా, నిజ జీవితంలో తన తాతగారి వారసత్వాన్ని తనదైన శైలిలో నిలబెట్టే 'రామయ్య'గా ఆయన తిరిగి రావాలని కోరుకోవడం, అభిమానుల మనసుల్లో ఉన్న చిరకాల వాంఛ. మరి దీనిని ఎన్టీఆర్ పట్టించుకుంటాడా? నటుడిగానే కొనసాగుతారా? అన్నది కాలమే చెబుతుంది. సమయం ఏ నిర్ణయం తీసుకుంటుందో, తారక్ మనసులో ఏముందో ఎవరికీ తెలియదు. కానీ, అభిమానుల ఆశలకు, జ్యోతిష్యుల అంచనాలకు, రాజకీయ సమీకరణాలకు మధ్య ఎన్టీఆర్ ఒక 'నిశ్శబ్ద విప్లవం'లా కనిపిస్తున్నారు.

..........

# సింగరేణిపై ప్రేముంటే గోదావరి లోయ బ్లాకులన్నీ కేటాయించాలి

(మొదటి పేజీ తరువాయి)



వాటిని ప్రభుత్వ రంగ సంస్థలే బొగ్గును తీయాలని పేర్కొందన్నారు. ఈ బ్లాకుల అన్వేషణ, అభివృద్ధి పనులు వేగంగా చేసి వీలైనంత త్వరగా బొగ్గు ఉత్పత్తి ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని నాడు కేంద్ర ప్రభుత్వం ఈ కేటాయింపు లేఖలో సింగరేణికి సూచించింది.

ఈ నేపథ్యంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే తాను పలుమార్లు కేంద్ర బొగ్గు శాఖ మంత్రులను, ప్రధాన మంత్రిని కలిసినట్లు చెప్పారు. సింగరేణికి మంజూరైన తాడిచర్ల2 బ్లాక్ కు మైనింగ్ లీజు ముందస్తు అనుమతులు ఇవ్వాలని పలుమార్లు లేఖలు రాసినట్లు చెప్పారు.

2024 మార్చి 7న తాను స్వయంగా కేంద్ర బొగ్గు శాఖ మంత్రిని కలిసి విజ్ఞప్తి చేశానని, 2026 మే 20న మరోసారి బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డిని కలిసి మైనింగ్ లీజు మంజూరుకు ముందస్తు అనుమతి ఇవ్వాలని కోరినట్లు వివరించారు. సింగరేణి సంస్థ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని తాము ఎన్నోసార్లు చేసినప్పటికీ నాన్చుడు ధోరణితో ఇప్పటివరకు మైనింగ్ లీజుకు అనుమతించకుండా జాప్యం చేసారని అన్నారు. ఇప్పుడు కొత్తగా బ్లాకును కేటాయిస్తున్నట్టు ప్రకటించటం విచారకరమని పేర్కొన్నారు. మైనింగ్ అనుమతులు ఆలస్యం అవ్వటం వలన సింగరేణి సంస్థ ఆ గనిని ప్రారంభించ లేకపోయిందని అన్నారు. ఈ కారణం వల్ల సంస్థకు అపార నష్టం కలిగిందన్నారు. ఇప్పటికైనా మైనింగ్ లీజుకు ముందస్తు అనుమతి ఇవ్వటం మంచి పరిణామం అని అన్నారు.

**ఏజెన్సీలో చట్టవిరుద్ధ వేలం**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మణుగూరు, ఇల్లందు వంటి సింగరేణి ప్రాంతాలు 1/70 గిరిజన చట్టం పరిధిలోకి వస్తాయని భట్టి చెప్పారు. ఇక్కడ గిరిజనులు మాత్రమే భూమిపై సర్వ హక్కులు కలిగి ఉంటారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రమే మైనింగ్ వంటి కార్యకలాపాలు చేసుకునే హక్కు కలిగి ఉంటాయన్నారు. ఈ విషయాలు చట్టంలో స్పష్టంగా చెప్పబడినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఇల్లందు సమీపంలోని కోయగూడెం3 ఓపెన్ కాస్ట్ బ్లాక్ ను, మణుగూరులోని ఓపెన్ కాస్ట్ డిప్ సైడు గనిని వేలం పాటలో పెట్టడం చట్టానికి వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయమని విమర్శించారు. గిరిజన చట్టం అమలులో ఉన్న సింగరేణి ప్రాంతంలోని బొగ్గు బ్లాకులను సింగరేణి సంస్థకు మాత్రమే కేటాయించడం సమంజసమని అన్నారు. సింగరేణి సంస్థ ప్రభుత్వ రంగ సంస్థ కనుక.. ఇక్కడ బొగ్గు తవ్వి తీసే అధికారం కేవలం సింగరేణికే ఉంటుందని పలు లేఖల ద్వారా కేంద్రానికి చెప్పామని అన్నారు. సింగరేణి సంస్థపై కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డికి ప్రేమ ఉంటే సింగరేణి విస్తరించిన గోదావరి లోయ ప్రదేశంలో ఉన్న అన్ని బొగ్గు బ్లాకులను సింగరేణి సంస్థకే కేటాయించాలని కోరారు. ఈ మేరకు సింగరేణి సంస్థతో పాటు తాము కూడా పలు బొగ్గు బ్లాకుల పేర్లను ప్రస్తావిస్తూ కేంద్ర బొగ్గు శాఖకు చెబుతూ వస్తున్నామని వివరించారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఇప్పటికే ప్రైవేటు వారికి కేటాయించిన కోయగూడెం3 ఓపెన్ కాస్ట్ బ్లాక్ అలాగే సత్తుపల్లి ఓపెన్ కాస్ట్3 బ్లాక్ లలో ఇప్పటివరకు మైనింగ్ కార్యకలాపాలు ప్రారంభించలేదన్నారు. వాటిని తక్షణమే సింగరేణికి అప్పగించాలని ఆయన అన్నారు. గోదావరి పరీవాహక ప్రాంతంలోని బొగ్గు బ్లాక్ లను వేలం పాటలో ఉంచకుండా సింగరేణికి కేటాయించాలని ఆయన చెప్పారు. ఇక్కడ ఉన్న గిరిజన చట్టాలు స్థానిక పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర బొగ్గు శాఖ సింగరేణికి నేరుగా కేటాయించడం ప్రభుత్వం నుంచి ప్రభుత్వానికి (జి టు జి) అనే పద్ధతిలో సమంజసంగా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, సింగరేణి డైరెక్టర్లు వెంకటేశ్వర్లు, గౌతమ్ పోట్రు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# హరీశ్ కాంగ్రెస్‌లోకి వస్తావా

**కూలిపోయే ప్రాజెక్టు కట్టి కూతలా?**
**: జగ్గారెడ్డి ఫైర్**

**మహా :** తనకు 3 నెలలు ఇరిగేషన్ శాఖ అప్పగిస్తే కాళేశ్వరం నీళ్లు తీసుకొస్తానన్న మాజీ మంత్రి హరీశ్ రావు సవాల్‌కు జగ్గారెడ్డి కౌంటర్ ఇచ్చారు. కాంగ్రెస్‌లో జాయిన్ అయితే సీఎం రేవంత్‌తో చర్చిస్తానని అన్నారు. మూడేళ్లు ఇరిగేషన్ మంత్రిగా ఉండి కూలిపోయే ప్రాజెక్టు కట్టి, ఇప్పుడు 3 నెలలు మంత్రి అంటున్నారని ఎద్దేవా చేశారు. హరీశ్ రావు కొత్త రాజ్యాంగం రాస్తున్నాడా? మంత్రి పదవి అంటే పిల్లలాటలా ఉందా? అంటూ మండిపడ్డారు.



# స్టాక్ మార్కెట్లలో రక్తపాతం

**.. ఒక్కరోజే రూ. 8 లక్షల కోట్లు ఆవిరి**

**ముంబై, మహా** అమెరికాఇరాన్ మధ్య మళ్లీ పెరిగిన ఉద్రిక్తతలు భారత స్టాక్ మార్కెట్లను కుదిపేశాయి. బుధవారం ట్రేడింగ్‌లో సూచీలు భారీగా కుప్పకూలడంతో ఇన్వెస్టర్ల సంపద ఒక్కరోజే సుమారు రూ. 8 లక్షల కోట్లు ఆవిరైంది. అమ్మకాల సునామీ కారణంగా బీఎస్ఈ సెన్సెక్స్, ఎన్ఎస్ఈ నిఫ్టీ 2 శాతానికి పైగా నష్టపోయాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 1,677 పాయింట్లు నష్టపోయి 76,503.60 వద్ద ముగిసింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 517 పాయింట్లు పతనమై 23,882.05 వద్ద స్థిరపడింది. బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ, ఆయిల్ అండ్ గ్యాస్ సహా అన్ని రంగాల షేర్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి. ఇరాన్‌తో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిపోయిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో అంతర్జాతీయంగా మార్కెట్ సెంటిమెంట్ దెబ్బతింది. హార్మూజ్ జలసంధిలో చమురు సరఫరాకు అంతరాయం కలుగుతుందనే భయాలతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు ఒక్కసారిగా పెరిగాయి. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ బ్యారెల్ ధర సుమారు 5 శాతం పెరిగి 78 డాలర్లకు చేరుకుంది. ఈ పరిణామాలు భారత కరెన్సీపైనా తీవ్ర ప్రభావం చూపాయి. అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.50 స్థాయిని దాటి బలహీనపడింది. పశ్చిమాసియాలో మళ్లీ రాజుకున్న ఉద్రిక్తతలు ద్రవ్యోల్బణ ఆందోళనలను పెంచాయని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. ఇటీవలి లాభాలన్నీ ఈ ఒక్క సెషన్‌లోనే తుడిచిపెట్టుకుపోయాయని ఆయన పేర్కొన్నారు.

# ట్యాపింగ్ కేసులో ఏ-1గా కేసీఆర్ ?

(మొదటి పేజీ తరువాయి)



చార్జిషీట్‌లో ప్రముఖంగా ఉండనున్నాయి. ఇప్పటికే ఈ కేసుకు సంబంధించి మాజీ సీఎం కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు, సంతోష్ రావులను, ఎమ్మెల్సీ నవీన్ రావును సిట్ అధికారులు లోతుగా ప్రశ్నించి విచారణను ఒక కొలిక్కి తీసుకువచ్చారు. కేవలం రాజకీయ ప్రత్యర్థులను అణచివేయడానికే కాకుండా, అనధికారికంగా సొంత పార్టీ నేతలు, పారిశ్రామికవేత్తల ఫోన్లను కూడా ట్యాప్ చేశారనే అంశాలపై పక్కా ఆధారాలు సేకరించిన తర్వాతే సిట్ ఈ ముగ్గురు కీలక వ్యక్తులపై చట్టపరమైన చర్యలకు పూనుకున్నట్లు తెలుస్తోంది. ఏ1గా కేసీఆర్ పేరు ఉండొచ్చన్న ప్రచారం ప్రధానంగా సాగుతోంది. సాక్ష్యాలు, ఆధారాలు బలంగా ఉన్న పలువురు ప్రముఖులను రహస్యంగా పిలిపించి, నాడు రికార్డ్ చేసిన వారి వ్యక్తిగత ఫోన్ సంభాషణలను స్వయంగా వినిపించినట్లు సమాచారం. ఆ ఆడియో క్లిప్పింగులు విన్న తర్వాతే అధికారులు వారి అధికారిక వాంగ్మూలాలను నమోదు చేశారు. ఈ రికార్డింగులు, కీలక నేతల వాంగ్మూలాలు కోర్టులో చార్జిషీట్‌కు ప్రధాన సాక్ష్యాలుగా ఉండనున్నాయి. తుది ఛార్జిషీట్ లో ఏమేమి సంచలనాలు ఉంటాయో.. చూడాల్సి ఉంది.

# ఢిల్లీలో భారీ ఉగ్రకుట్ర భగ్నం

**పెట్రోల్ బాంబు దాడులకు ఐఎస్ఐ కుట్ర**

**న్యూఢిల్లీ, మహా :** ఢిల్లీ పోలీసులు భారీ ఉగ్ర కుట్రను భగ్నం చేశారు. పాకిస్థాన్ ఐఎస్ఐ హ్యాండ్లర్ షెహజాద్ భట్టీ పర్యవేక్షణలో ఢిల్లీపై పెట్రోల్ బాంబు దాడులకు కుట్ర పన్నినట్లు వారు గుర్తించారు. బుధవారం ఢిల్లీ, పంజాబ్‌ల్లో ఆరుగురు అనుమానిత వ్యక్తులను ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ అరెస్టు చేసింది. వారిని తమదైన రీతిలో విచారణ చేయగా, ఈ కుట్ర గురించి కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. "పాకిస్థాన్‌కు చెందిన ఐఎస్ఐ హ్యాండ్లర్ షెహజాద్ భట్టీ ఆదేశాల మేరకు దేశ రాజధాని ఢిల్లీలోని పలు కీలక ప్రాంతాల్లో పెట్రోల్ బాంబు దాడులు చేయడానికి ఉగ్రవాదులు కుట్ర పన్నారు. ముఖ్యంగా ఢిల్లీలోని సివిల్ లైన్స్ ప్రాంతంలో ఉన్న న్యూ పోలీస్ లైన్స్, ఆనంద్ విహార్ ఇంటర్‌స్టేట్ బస్ టెర్మినల్, రైల్వే స్టేషన్ సహా విపరీతమైన రద్దీ ఉండే మార్కెట్ ప్రాంతాల్లో వారు రెక్కీ నిర్వహించి, దాడులు చేయడానికి ప్లాన్ చేశారు" అని పోలీసులు తెలిపారు.

**యాత్ర ప్రారంభమైన కొద్ది రోజుల్లోనే**

# అమర్ నాథ్ గుహలో మంచు శివలింగం అంతర్ధానం

**ఆందోళన చెందుతున్న భక్తులు**

ఇంటర్నెట్ డెస్క్, మహా : వార్షిక అమర్‌నాథ్ యాత్ర ప్రారంభమైన కొద్ది రోజులకే పవిత్ర గుహలోని సహజసిద్ధ మంచు శివలింగం దాదాపు పూర్తిగా కరిగిపోవడం భక్తులను ఆందోళనకు గురిచేస్తోంది. మే నెలలో సుమారు ఏడు అడుగుల ఎత్తుతో కనిపించిన మంచు శివలింగం ప్రస్తుతం 99 శాతం మేర క్షీణించినట్లు అధికారులు వెల్లడించారు. గత మూడు సంవత్సరాలుగా కూడా యాత్ర ప్రారంభమైన వారం రోజుల్లోనే మంచు శివలింగం కరిగిపోతున్న పరిస్థితి కనిపిస్తోంది. పర్యావరణ నిపుణుల విశ్లేషణ ప్రకారం.. ప్రాంతీయంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, శీతాకాలంలో తగినంత మంచు కురవకపోవడం, తీవ్రమైన ఉష్ణగాలుల ప్రభావం వల్ల ఈ పరిస్థితి ఏర్పడుతోంది. మరోవైపు రోజూ వేల సంఖ్యలో భక్తులు గుహను సందర్శించడం వల్ల ఏర్పడుతున్న మానవ ఉష్ణోగ్రత, కాలుష్యం కూడా మంచు శివలింగం వేగంగా కరిగిపోవడానికి కారణమవుతోందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.లప్రస్తుతం రోజుకు సుమారు 13 వేల నుంచి 20 వేల మంది వరకు యాత్రికులు అమర్‌నాథ్ గుహను సందర్శిస్తున్నారు. జూన్ 28న ప్రారంభమైన 57 రోజుల యాత్రలో ఇప్పటికే లక్ష మందికి పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మంచు శివలింగం కరిగిపోయినప్పటికీ, అమర్‌నాథ్ క్షేత్రం ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఏమాత్రం తగ్గలేదని భక్తులు చెబుతున్నారు. ప్రభుత్వం కల్పించిన కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు, యాత్రికులకు అందుబాటులో ఉంచిన వసతులపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. యాత్రను మరికొన్ని రోజులు ముందుగానే ప్రారంభించి ఉంటే ఎక్కువ మంది భక్తులకు మంచు శివలింగ దర్శనం లభించేదని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

# ఇరాన్‌తో డీల్ క్లోజ్ ట్రంప్ సంచలన ప్రకటన

**చర్చలు కొనసాగించడం సమయం వృథా అని వ్యాఖ్య**

**ఇరాన్‌పై అమెరికా భారీ ప్రతీకార దాడులు**



**మహా :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో కుదిరిన తాత్కాలిక అవగాహనా ఒప్పందం (ఎంఓయూ) ఇక ముగిసినట్టేనని సంచలన ప్రకటన చేశారు. ఆ దేశంతో చర్చలు కొనసాగించడం సమయం వృథా అంటూ మండిపడ్డారు. అయితే అమెరికా ప్రతినిధులు చర్చలు కొనసాగించాలనుకుంటే తనకు అభ్యంతరం లేదని చెప్పారు. హర్మూజ్ జలసంధిలో నౌకలపై దాడులకు ప్రతీకారంగా అమెరికా ఇరాన్‌లోని బందర్ అబ్బాస్, సిరిక్ పోర్టు నగరాలు, ఖెష్మ్ ద్వీపంలోని లక్ష్యాలపై విరుచుకుపడింది. అదే సమయంలో ఇరాన్ చమురు విక్రయాలకు ఇచ్చిన అనుమతిని కూడా రద్దు చేసింది. దీనికి ప్రతీకారంగా బహ్రెయిన్, కువైట్‌లపై ఇరాన్ దాడులు చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో నాటో సదస్సు సందర్భంగా మీడియాతో మాట్లాడిన ట్రంప్.. ''నా దృష్టిలో ఇరాన్‌తో చర్చలు ముగిసిపోయాయి. వారితో ఇక చర్చించాలని నాకు లేదు. వాళ్లతో చర్చలు జరపడం సమయం వృథా'' అని పేర్కొన్నారు. ఇరాన్ నాయకత్వంపై కూడా ట్రంప్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ''వాళ్లు ప్రమాదకరమైన వ్యక్తులు. అణ్వాయుధాలు వారి చేతికి వస్తే కచ్చితంగా ఉపయోగిస్తారు. అందుకే నా దృష్టిలో చర్చలు ముగిసినట్టే'' అని వ్యాఖ్యానించారు.

టర్కీ రాజధాని అంకారాలో జరిగిన నాటో శిఖరాగ్ర సమావేశంలో, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు సంబంధించి చేశారు. మీడియా అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ, "ఇప్పుడు అవగాహన ఒప్పందం ముగిసిపోయిందని నేను భావిస్తున్నాను" అని ట్రంప్ అన్నారు. అమెరికా, ఇరాన్‌ల మధ్య పరిస్థితి ఎంతగా ముదిరిందంటే, ఇరు దేశాల మధ్య ఒప్పందం భవిష్యత్తు ముగిసిపోయిందని భావించాలని ఆయన సూచించారు. "నిన్న రాత్రి ఇరాన్‌లోని అత్యంత ప్రమాదకరమైన వ్యక్తులపై శక్తివంతమైన దాడి చేశాము" అని ట్రంప్ అన్నారు. ఈ చర్య అమెరికా భద్రతకు అత్యవసరమని ఆయన అభివర్ణించారు ఈ ఆపరేషన్‌ను చాలా స్ట్రాంగ్‌గా నిర్వహించామని చెప్పారు. "వారికి జబ్బుంది, వారిలో ఏదో లోపం ఉంది" అని అన్నారు. అమెరికా, ఇరాన్‌ల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న తరుణంలో, ఇరు దేశాల మధ్య ఇటీవలి సైనిక పరిణామాలు పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మారిన టైంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు.

పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో ఈ 60 రోజుల మధ్యంతర ఒప్పందం కుదిరింది. ఘర్షణకు శాశ్వత పరిష్కారం చూపేందుకు పరోక్ష చర్చలకు అవకాశం కల్పించేందుకు లక్ష్యంతో ఈ కాల్పుల విరమణ ఒప్పందం జరిగింది. అయితే, ఖతార్‌లో జరిగిన చర్చలు ఎటువంటి ఫలితాన్ని ఇవ్వలేదు. ఇంతలో అమెరికా మంగళవారం ఇరాన్ లక్ష్యాలంగా దాడులు మొదలు పెట్టింది. దీనికి తోడు ట్రంప్ కూడా తీవ్రంగా స్పందించారు. "వారు అబద్ధాలకోరులు, మోసగాళ్ళు, రోగులు," అని విరుచుకుపడ్డారు. ఇరాన్ అధికారులతో తదుపరి చర్చలు జరపడానికి తనకు ఆసక్తి లేదని పేర్కొన్నట్లు నివేదికలు తెలిపాయి.

వాషింగ్టన్ టెహ్రాన్ మధ్య సంబంధాలు వేగంగా క్షీణిస్తున్న తరుణంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించారని ఇరుపక్షాలు ఒకరిపై ఒకరు ఆరోపించుకుంటున్నాయి. హోర్ముజ్ జలసంధిలో జరిగిన దాడులకు ప్రతిస్పందనగా ఈ దాడులు జరిగాయని అమెరికా పేర్కొంది. హోర్ముజ్ జలసంధి గుండా ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకలపై ఇరాన్ చేసిన దాడులకు ప్రతిస్పందనగా అమెరికా సైనిక దాడులు జరిపినట్లు సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) తెలిపింది. ఈ దాడుల అనంతరం మరోసారి ఉద్రిక్తత చోటుచేసుకుంది. తన ప్రసంగంలో ఇరాన్‌లో జరిగిన ప్రభుత్వ వ్యతిరేక నిరసనలను ట్రంప్ ప్రస్తావించారు. ఇరాన్ అధికారులు తీవ్రమైన అణచివేతకు పాల్పడ్డారని ఆయన ఆరోపించారు.

**వాషింగ్టన్‌పై టెహ్రాన్ తీవ్ర ఆరోపణలు**

అమెరికా పదే పదే చేస్తున్న దాడులను ఇరాన్ అధికారులు తీవ్రంగా ఖండించారు. ఇవి కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడమేనని, ఈ ప్రాంతంలో వాషింగ్టన్ మరింత అస్థిరతను సృష్టిస్తోందని ఆరోపించారు. ఇరు దేశాల మధ్య కుదిరిన అవగాహన ఒప్పందాన్ని అమెరికా పదేపదే ఉల్లంఘించిందని ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. పదేపదే జరుగుతున్న ఈ దురాక్రమణ చర్యలకు టెహ్రాన్ ప్రతిస్పందిస్తుందని హెచ్చరించింది.

# ఏపీ, తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా ఎన్ఐఏ భారీగా సోదాలు

**ఐసీస్, ఏక్యూఐఎస్ ఉగ్రవాద కార్యకలాపాల ప్రచారంపై సోదాలు**




హైదరాబాద్, మహా : తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తో పాటు దేశవ్యాప్తంగా ఎన్ఐఏ అధికారులు బుధవారం భారీగా సోదాలు చేపట్టారు. ఐసీస్, ఏక్యూఐఎస్ ఉగ్రవాద కార్యకలాపాల ప్రచారంపై సోదాలు చేశారు. భారత్‌లో హింసాత్మక జిహాద్ ద్వారా ఇస్లామిక్ స్టేట్ ఏర్పాటు కుట్రపై దర్యాప్తు ముమ్మరం చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు 10 రాష్ట్రాలు, ఢిల్లీ కేంద్రపాలిత ప్రాంతంలోని మొత్తం 20 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో పలు డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న పరికరాలను ఫోరెన్సిక్ పరీక్షలకు పంపనున్నట్లు ఎన్ఐఏ అధికారులు తెలిపారు. ఈ కేసులో ఇప్పటి వరకు 11 మంది నిందితులు, ఓ బాలుడిని జువెనైల్ నుంచి అదుపులోకి తీసుకున్నామని అధికారులు వెల్లడించారు. విజయవాడ పోలీసులు మార్చిలో నమోదు చేసిన కేసును మేలో ఎన్ఐఏకు బదిలీ చేసిన విషయం తెలిసిందే.ప్రధాన నిందితుడు రెహ్మతుల్లా షరీఫ్ మహ్మద్ నివాసంలో గతంలో ఐసీస్, ఏక్యూఐఎస్‌కు సంబంధించిన అభ్యంతరకర ప్రచార సామగ్రి లభ్యమైంది. గతంలో స్వాధీనం చేసుకున్న డిజిటల్ పరికరాల సాంకేతిక విశ్లేషణ ఆధారంగా ఎన్ఐఏ అధికారులు బుదవారం సోదాలు నిర్వహించారు. అరెస్టైన నిందితులు దేశంలోని యువతను జిహాదీ భావజాలం వైపు మళ్లించే ప్రయత్నాలు చేసినట్లు అధికారుల దర్యాప్తులో వెల్లడైంది. విదేశీ హ్యాండ్లర్లతో ఆన్‌లైన్ ద్వారా సంబంధాలు కొనసాగిస్తూ ఉగ్ర భావజాలాన్ని వ్యాప్తి చేసినట్లు ఎన్ఐఏ అధికారులు గుర్తించారు. దేశాన్ని అస్థిరపరిచి 'ఖలీఫత్' స్థాపనకు కుట్ర పన్నిన వారిని గుర్తించే దిశగా దర్యాప్తు కొనసాగుతోందని ఎన్ఐఏ అధికారులు పేర్కొన్నారు.



# కాసిపేట 2. ఇంక్లైన్ గని పై ప్రధాన నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం

**బెల్లంపల్లి,మహా:**తాడిచర్ల బ్లాక్ టు గని ఎటువంటి వేలం పాట లేకుండా కేంద్ర ప్రభుత్వం సింగరేణికి ఇచ్చిన సందర్భంగా బుధవారం రోజు కాసిపేట 2. మైన్ ఆవరణలో బి ఎమ్ ఎస్ కార్మిక సంఘం ఆధ్వర్యంలోమంచిర్యాల జిల్లా పడుకో బిజెపి ఉపాధ్యక్షులు కోడి రమేష్ ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకాన్ని నిర్వహించారు. కార్మికులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ మిఠాయిలు పంచి పెట్టి సంబరాలు చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడిచర్ల మైన్ సింగరేణికి ఎటువంటి వేలం పాట లేకుండా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిందని అని తెలియజేస్తూ తాడిచర్ల బ్లాక్ టు ద్వారా సింగరేణి సంస్థకు సంవత్సరానికి 6000 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి 64 వేల కోట్ల ఆదాయం రావడం జరుగుతుందని సుమారు 1200 మంది కార్మికులకు ఉపాధి కలుగుతుందని అన్నారు. అదేవిధంగా రాబోయే రోజుల్లో మరికొన్ని బ్లాకులను కూడా సింగరేణి సంస్థ వేలం పాటలో పాల్గొంటే కేంద్ర ప్రభుత్వం ఇవ్వడానికి కేంద్ర మంత్రివర్యులు కిషన్ రెడ్డి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు బి ఎం ఎస్ నాయకులు ఏరియా ఉపాధ్యక్షులు గుర్రం ప్రదీప్, ఏరియా కార్యదర్శి చెట్టి వీరన్న, కేకే ఓసి ఫిట్ సెక్రటరీ మంద రజినీకాంత్, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస రాజు, బిజెపి నాయకులు మంచిర్యాల జిల్లా కార్యదర్శి రాచర్ల సంతోష్ కుమార్, కాసిపేట మండల అధ్యక్షులు సూరం సంపత్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శి ప్రసన్న, నాయకులు ఏరోజు శ్రీనివాస్, తోటపల్లి ఓం సాయి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# బెల్లంపల్లి లో ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు

**బెల్లంపల్లి, మహా:** దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలను బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదేశాల మేరకు బుధవారం నాడు బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పెద్ద ఎత్తున వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా కేక్ కట్ చేసి పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకుల కార్యకర్తల సమక్షంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టిపిసిసి జనరల్ సెక్రెటరీ ప్రభుత్వ అబ్జర్వర్ రాజేష్ హాజరై రాజశేఖర్ రెడ్డి చేసిన పథకాలను వివరిస్తూ అతని ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి మున్సిపాలిటీ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు ఎస్సీ సెల్ నాయకులు,బీసీ సెల్ నాయకులు మైనార్టీ నాయకులు మహిళా నాయకురాలు యూత్ కాంగ్రెస్ నాయకులు 34 వార్డుల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పార్టీ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# వానాకాలానికి తెలంగాణ సోనా బెస్ట్.. జూలై చివరి వరకు నారు పోసుకోవచ్చు.

**పాలకుర్తి, జూలై 08 మహా** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి మండలంలోని వానాకాలం సాగులో భాగంగా వరి నారు నాటేటప్పుడు రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని పాలకుర్తి మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్ సూచించారు. బుధవారం మండలంలోని రాణా పూర్ గ్రామంలో రైతు బంక సదయ్యకు చెందిన రెండు ఎకరాల వరి నాట్లను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి, రైతులకు పలు కీలక సూచనలు, సలహాలు అందించారు.ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ.వరి నారు నాటే సమయంలో ఆకుల చివర్లను 1/3 వంతుకత్తిరించి నాటడం వల్ల మొక్కకు ఒత్తిడి తగ్గి, వేరు వ్యవస్థ బలంగారూపాంతరం చెందుతుందన్నారు. దీనివల్ల గాలికి నారు ఒరిగిపోకుండా ఉండటమే కాకుండా, నాటిన తర్వాత మొక్క వేగంగా కుదురుకుంటుందని తెలిపారు. ముఖ్యంగా, కాండం తొలిచే పురుగు లేత ఆకు కొసలపై గుడ్లు పెట్టకుండా ముందే నివారించవచ్చని ఆయన పేర్కొన్నారు.ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న స్వల్పకాలిక రకం ఆర్ ఎన్ ఆర్ 15048 తెలంగాణ సోనా సాగుకు ఎంతో అనుకూలమైనదని ఏఓ ప్రమోద్ కుమార్ తెలిపారు. ఇది అతి సన్న గింజ వరి రకమని, దీని పంట కాలం కేవలం 125 రోజులు మాత్రమే ఉంటుందని చెప్పారు. ఎకరానికి 26 నుండి 28 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని వివరించారు. ఈ రకం నారును జూలై చివరి వారం వరకు పోసుకోవచ్చని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పత్రిక ప్రకటన ద్వారా కోరారు.

# టీఎంసీకి చెందిన రూ.440.42 కోట్లు ఫ్రీజ్.

**మనీ లాండరింగ్ కేసులో భాగంగా ఈడీ చర్య.**

తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) సంక్షోభం పెరుగుతోంది. ఇదిలా ఉంటే, తాజాగా మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా టీఎంసీకి చెందిన రూ. 440.42 కోట్ల నిధులు ఉన్న మూడు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఖతాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఫ్రీజ్ చేసింది. పార్టీ నిధుల ద్వారా భారీ స్థాయిలో అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు ఈడీ ఆరోపిస్తోంది. ఈ కేసులో భాగంగా ఢిల్లీలోని ఐదు ప్రాంతాల్లో ఈడీ సోదాలు చేసింది. ఇవన్నీ విమానయానరంగంలో పనిచేస్తున్న కేర్‌వెల్ గ్రూప్ ఆఫ్ కంపెనీలకు సంబంధించిన ప్రాంతాలని అధికారులు తెలిపారు.2023 ఏప్రిల్ నుంచి 2026 జూన్ మధ్య టీఎంసీ ఖాతాల నుంచి సుమారు రూ. 160 కోట్లు కేర్‌వెల్ ఏవియేషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌తో పాటు మరో అనుబంధ కంపెనీకి బదిలీ అయినట్లు ఈడీ గుర్తించింది. దీని తర్వాత ఆ సంస్థల నుంచి రూ. 82.96 కోట్లు కొత్తగా ఏర్పడిన మరో కంపెనీ అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ అయినట్లు దర్యాప్తులో తేలిందని ఈడీ చెప్పింది. ఈ నిధుల్లో రూ. 112 కోట్లతో ఎంబ్రాయర్ లెగసీ 600 విమానం, అగస్టా 109 ఎస్‌సీ హెలికాప్టర్ కూడా కొనుగోలు చేసినట్లు ఈడీ వెల్లడించింది. హెలికాప్టర్ కొనుగోలులో కొంత విదేశీ నిధులు ఉపయోగించనట్లు అనుమానిస్తోంది.



# భద్రతా బలగాల చేతిలో లష్కరే టాప్ కమాండర్ జాకీర్ హతం

**మరో ఉగ్రవాది కసం గాలింపు ముమ్మరం**

**కశ్మీర్‌లోని షోపియాన్ జిల్లాలో ఐదు రోజులుగా కొనసాగుతున్న ఎన్‌కౌంటర్**

**జమ్మూ, మహా :** జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల గుండెల్లో వణుకు పుట్టిస్తూ భారత భద్రతా దళాలు మరో అదిరిపోయే సక్సెస్ సాధించాయి. షోపియాన్ జిల్లాలో గత ఐదు రోజులుగా సాగుతున్న హైవోల్టేజ్ 'కౌంటర్ టెర్రరిజమ్' ఆపరేషన్‌లో మోస్ట్ వాంటెడ్, లష్కరే తోయిబా టాప్ కమాండర్ జాకీర్ గనాయ్ హతమయ్యాడు. భద్రతా బలగాలు అతడిని కాల్చి చంపాయి. ఘటనా స్థలం నుంచి అతడి మృతదేహాన్ని కూడా సైన్యం స్వాధీనం చేసుకుంది. అసలు ఈ ఆపరేషన్ ఎలా స్టార్ట్ అయిందంటే... జులై 3న షోపియాన్‌లోని తోటల ప్రాంతంలో అమర్చిన నిఘా కెమెరాల్లో ఈ టాప్ కమాండర్ జాకీర్ గనాయ్‌తో పాటు లతీఫ్ అనే మరో ఉగ్రవాది కదలికలు రికార్డయ్యాయి. దీంతో .. పక్కా స్కెచ్‌తో రంగంలోకి దిగిన భారత సైన్యం, జమ్మూకశ్మీర్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ జాయింట్ టీమ్‌గా ఏర్పడి ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టాయి. దట్టమైన తోటల గుండా ఉగ్రవాదులు ఎస్కేప్ కాకుండా ఉండేందుకు ఆర్మీకి చెందిన స్పెషల్ విభాగానికి చెందిన 'విక్టర్ ఫోర్స్' రంగంలోకి దిగి, బయటకు వెళ్లే దారులన్నింటినీ పూర్తిగా బ్లాక్ చేసింది. రాత్రి వేళల్లో కూడా చీకటిని చీల్చుకుంటూ ఆపరేషన్ సాగించేందుకు స్పెషల్ లైటింగ్ సిస్టమ్స్ ఏర్పాటు చేశారు. భద్రతా దళాలు వాళ్లు నక్కిన చోటికి చేరువవుతున్న సమయంలో... ఉగ్రవాదులు ఒక్కసారిగా కాల్పులకు తెగబడ్డారు. మన జవాన్లు ధీటుగా బదులివ్వడంతో లష్కరే టాప్ కమాండర్ జాకీర్ గనాయ్ అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. ప్రస్తుతానికి అక్కడ దాక్కున్న రెండో ఉగ్రవాది లతీఫ్ కోసం దళాలు వేటను మరింత ముమ్మరం చేశాయి. కశ్మీర్ లోయలో 'లష్కరే' నెట్‌వర్క్‌కు ఇది కోలుకోలేని దెబ్బ అని చెప్పొచ్చు.





# వైయస్సార్ కు యాచారంలో ఘనంగా నివాళులు..

**నివాళులర్పించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు**

**ఇబ్రహీంపట్నం జులై 8 మహా:**విప్లవాత్మక పథకాలతో ప్రతి ఇంటా వెలుగులు నింపిన ప్రజానేత వైయస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి సందర్భంగా యాచారం మండలం, నక్కర్త మేడిపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోటార్స్ శ్రీశైలం ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.

# హామ్... భూామ్... ఫట్



భూమి నాది అన్న భూమి పక్కన నవ్వు... ధనము నాది అన్న ధనం నవ్వు... అంటూ వేమన ఇహ, పర మర్మం వివరించారు. ఇప్పుడు ఆయన చెప్పిన నీతి వ్యాఖ్యలు అక్షరాల నిజం అవుతున్నాయి. పెళ్లి చేసి చూడు,ఇళ్ళు కట్టి చూడు అన్నది నానుడి. ఇళ్ళు కట్టటంలోనూ పెళ్లి చేయటంలోనూ ఎన్ని ఇబ్బందులు వుంటాయో ఈ సామెత స్పష్టత ఇస్తుంది. ఇల్లు కట్టాలి అంటే ముందు భూమి ఉండాలి. ఆ భూములకే రెక్కలు వస్తే..? వస్తే ఏమిటీ, వచ్చేసాయి. ఒకటి కాదు, రెండు కాదు, ఏకంగా వేల ఎకరాల భూములు ఇప్పుడు అన్యాక్రాంతమయ్యాయి. ప్రజల భూములకు శ్రీరామ రక్షగా ఉంటుందనుకున్న ధరణి పోర్టల్ భూ బకాసురులకు వరంగా మారింది. దీంతో కడుపు నిండే వరకు, కాదు, కాదు గొంతు చివరి వరకు కనిపించిన భూములను ఇట్టే భోజనం చేశారు. అతిగా తింటే అరగదు. అదే జరిగింది. మింగిన భూముల బాగోతం బట్టబయలు అయింది. ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే దాన్ని ఇట్టే మాయం చేసిన అక్రమార్కులు లక్షల కోట్ల విలువ చేసే భూములు బుక్కేశారు అనే నిజం తెలుసుకున్న తెలంగాణ ప్రభుత్వం అవాక్కు అయింది. అధికారులు, భూబకాసురులు ఊర్లకు ఊర్లనే పంచుకున్న తీరు చూస్తే భుదాహం ఇంత దారుణంగా వుంటుందా అని నోర్లు తెరవక తప్పదు. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో వున్నప్పుడు రెవిన్యూ శాఖలో మార్పులు, చేర్పులు చేసేందుకు అప్పటి సీఎం కేసీఆర్ ధరణి అనే ఓ కొత్త విధానానికి శ్రీకారం చుట్టారు. తెలంగాణలోని ప్రతీ అంగుళం భూమి వివరాలు ధరణిలో నిక్షిప్తం అవుతాయని, ముఖ్యంగా రైతులకు ఇది ఓ రక్షణ రేఖ అవుతుందని అప్పట్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రచారం చేసింది. ధరణి అమలు కోసం పోర్టల్ కూడా అప్పటి సర్కార్ ఏర్పాటు చేసింది. భూ సమస్యల పరిష్కారంతో ఎవరి భూములు వారికే దక్కేలా ధరణి ఓ ఆయుధంగా పని చేస్తుందని అందరు నమ్మారు. ఇక్కడ నుంచే అసలు కథ మొదలైంది. ధరణి పోర్టర్ లోని లోపాలు కొందరు అధికారులు, భూ ఆక్రమణదారులు తమకు అనుకూలంగా మార్చేసుకున్నారు. చేతివాటం ప్రదర్శించారు. వీరికి అధికారులు అండగా నిలిచారు. పూర్తి స్థాయిలో సహకారం అందించారు. ఎక్కడ ప్రభుత్వం భూములు ఉన్నాయో, ఎక్కడెక్కడ భూ యాజమాన్యం లేని భూములు ఉన్నాయో, ఏయే భూములు సులభంగా కబ్జాలు చేయచ్చో గుర్తించారు. ఆలస్యం చేయకుండా వాటిని తమ పరం చేసుకున్నారు. తెలంగాణ వ్యాప్తంగా ఈ తంతు ఓ ఉద్యమంలా సాగి పోయింది. ఎవరి భూమి ఎవరు స్వాహ చేసారో కూడా తెలియని పరిస్థితి ఏర్పడింది. నాలుగైదు సంవత్సరాలనుండి ఈ భూ దందా సాగుతున్నా అది బయటకు పొక్క లేదు.

ధరణి పోర్టల్ మార్పులపైన అనేక అనుమానాలు ఇప్పుడు మొదలయ్యాయి. తిలాపాపం తల పిడికెడుగా ఇందులో చాలా మంది పాత్ర బయట పడుతోంది. ముఖ్యంగా రెవిన్యూ సిబ్బంది, అధికారులు,, స్థానిక నేతలు, దళారులు ఇలా ఎవరికి వారే పోర్టల్ లోని బలహీనతలను తమ జేబులు నింపుకొనేలా మల్చుకున్నారు. భూ అక్రమాల వెనుక కీలక వ్యక్తులు ఉండకపోతే ఈ స్థాయిలో ఆక్రమణలు జరిగేవి కావు. పట్టా భూములు, అసైన్డ్ భూములు ఇట్టే తమ పరం చేసుకోవటం ధరణి అక్రమాలకు పరాకాష్టగా నిలుస్తోంది.ధరణి పోర్టర్ లోని లొసుగులను ఆధారంగా చేసుకొని భూ యాజమాన్యం అనుమతి లేకుండానే ఎకరాల కొద్ది భూములు తమవిగా మార్చుకున్న ప్రబుద్ధులు కోట్ల రూపాయలు విలువ చేసే భూ కబ్జాలు చేశారు. దొంగచాటుగా ఆ భూములకు యజమానులు అయ్యారు. నిషేధిత జాబితాల్లో వున్న భూములు కూడా వదలలేదు. అసైన్డ్ భూములు కూడా ఇందులో వున్నాయి. తెలంగాణలోని అనేక జిల్లాలో ఈ భూ ఆక్రమణ దందాలు ఓ రేంజ్ లో జరిగిపోయాయి. అటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మొదలుకుని ఇటు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా వరకు ఇలాంటి దురాక్రమణలు జరగటం గమనిస్తే ఓ పథకం ప్రకారమే ఈ వ్యవహారం సాగినట్లు అర్థమవుతోంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో తొలిసారి వెలుగు చూసిన ఈ కబ్జాల తంతు ఇప్పుడు తెలంగాణ వ్యాప్తంగా జరిగినట్టు బయట పడింది. దీంతో ప్రభుత్వం షాక్ తింది. భూములకు రెక్కలు రావటంతో తెలంగాణ ప్రజల్లో ఆందోళన ప్రారంభమైంది. రెవిన్యూ సిబ్బంది, అధికారుల సహకారం లేకుండా భూముల బదాలయింపు అసాధ్యం. ఈ అక్రమాలకు వారి పూర్తి సహాయం వుండే తీరాలి. ప్రస్తుతం తెలంగాణలో అధికారుల దృష్టిలోకి వచ్చిన దాదాపు 18 వేల ఎకరాలు భూములు ధరణి పోర్టల్ ద్వారా అన్యాక్రాంతం అయ్యాయని తేలింది. ఇది ఇంకా పెరిగే అవకాశం వుంది.

అసలు తెలంగాణలో ఏం జరుగుతోంది? ధరణి పోర్టర్ ద్వారా ఎన్ని వేల ఎకరాల భూములు పేర్లు మారాయి? దీనికి మూల విరాట్ ఎవ్వరు? ఇదే ఇప్పుడు బట్టబయలు కావాలి. ఉద్యోగాలు, ఉపాధి, వ్యాపార వ్యవహారాల కోసం విదేశాల్లో ఉంటున్న వారి భూములు, ఆస్తుల మాటేమిటీ? అవి ఉన్నాయా? ఇప్పటికే చేతులు మారాయా? రైతుల భూముల పరిస్థితి ఏమిటీ? ఇలాంటి సందేహాలు ప్రజలను వెంటాడుతున్నాయి. 2017 తర్వాత నుంచి భూబకాసురులు భూములు మింగేస్తూ వస్తున్నట్లు అనుమానాలు బలపడుతున్నాయి. కబ్జాలు చేసిన భూములు ఎన్ని చేతులు మారాయో కూడా అంతు తేలాల్సి వుంది. ధరణి పోర్టల్ వచ్చిన నేపథ్యంలో తమ భూమి వివరాలు ఇక భద్రంగా ఉంటాయని అందరు అనుకున్నారు. అది భ్రమగా మిగిలింది. ధరణి సాఫ్ట్ వేర్ ను కూడా మేనేజ్ చేసేసిన ఘనులు అందులో లొసుగులతో అందినంత భూమి దోచుకొని సైడ్ అయ్యారు. ఈ కుంభకోణం మీద తెలంగాణ సర్కార్ దృష్టి పెట్టింది. లోతుగా విచారణ కోసం సిట్ వేసింది. రెవిన్యూ ఉన్నతధికారులు, సైబర్ పోలీసులు, ఇతర శాఖ అధికారులతో దర్యాప్తు మొదలు పెట్టేందుకు సిద్ధం అయింది. భూములు మింగిన తిమింగలాల భరతం పట్టేందుకు చక్రవ్యూహం ప్రభుత్వం పన్నుతోంది. భూబకాసురులకు సహకరించిన అధికారులు, సిబ్బంది, దళారులు, నేతలు ఎవ్వర్నీ వదిలి పెట్టేది లేదని ప్రభుత్వం స్పష్టంగా చెప్పేసింది. సీఎం రేవంత్ రెడ్డి ఈ అక్రమాలపైన సీరియస్ గానే వున్నారు. ధరణి కుంభకోణం తెలంగాణను కుదిపి వేస్తోంది. తమ భూములు, స్థలాలు, కట్టుకున్న ఇళ్లు తమ పేర్లుతో ఉన్నాయా? లేక మాయం అయ్యాయా? ఇదే సగటు జీవి ఆవేదన, ఆందోళన. దీంతో కొందరు రెవిన్యూ కార్యాలయాలకు పరుగులు పెడుతున్నారు. అధికారులు వివరాలు అందించినా ప్రజలలో నమ్మకం కుదరటం లేదు. ఏదో జరిగింది. జరుగుతోంది. ముమ్మందు ఏం జరగబోతోంది. ఇదే జనాల భయం. తమ ప్రమేయం లేకుండానే భూముల్లో పేర్లు మారుతుండటం వారిని కలవర పరుస్తోంది. ఈ అనుమానాలు అక్కడితో ఆగటం లేదు. ధరణి ప్లేస్ లో కాంగ్రెస్ ప్రభుత్వం అమలులోకి తెచ్చిన భూ భారతిపైన ప్రజలకు సందేహం మొదలైంది. ప్రభుత్వం ఎన్ని పోర్టర్లు తెచ్చినా దురాక్రమణదారులు కొత్త దారుల్లో కుట్రలు చేస్తూనే వున్నారు. వారికి సహకారం అందుతూనే వుంది. ఇదే ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది.ధరణి పోర్టల్ సురక్షితం కాదని, దాన్ని అడ్డు పెట్టుకొని బీఆర్ఎస్ నేతలు అక్రమాలకు దిగుతున్నారని గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆరోపించిన కాంగ్రెస్ తాము అధికారంలోకి వస్తే ధరణిని బంగాళాఖాతంలో కలుపుతామని చెప్పింది. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ధరణి రద్దు చేసి అదే స్థానంలో భూ భారతి తీసుకొని వచ్చింది.

కాంగ్రెస్ ప్రభుత్వం అమలులోకి తీసుకొని వచ్చిన భూ భారతి భద్రత ఎంత? ఇది ప్రజలు, ప్రతిపక్షాలు వేస్తున్న ప్రశ్న. భూ భారతి ద్వారా కూడా అక్రమాలు జరిగినట్టు ఆరోపణలున్నాయి. ఈ పోర్టల్ ద్వారా వేల ఎకరాల భూమి దోపిడీ చేసారని బీఆర్ఎస్ తో పాటు బీజేపీ నేతలు అంటున్నారు. దీంతో ప్రజల్లో కలవరం ఎక్కువ అవుతోంది. అసలు ఏది సురక్షితం అనేది అర్థం కాని పరిస్థితి ఇప్పుడు వారికి వచ్చింది. కబ్జాదారుల కన్ను పడితే ఏ భూమి అయినా, ఎవరిది అయినా మాయం అయ్యే దుస్థితి నెలకొంది. బడా నేతల అండదండలు వీరికి పుష్కలంగా ఉండటమే వారి బలం. హైదరాబాద్, దాని శివారు ప్రాంతాల్లో కూడా కబ్జాలు ఓ రేంజ్ లోనే సాగిపోతున్నాయి. కబ్జా భూముల్లో బహుళ అంతస్థులు వెలుస్తున్నాయి. ఇలాంటి కబ్జాల పైన హైడ్రా ఉక్కుపాదం మోపుతూనే వుంది. పార్కులు, చెరువులు, కాలువలు కూడా కబ్జా చేసే వారికి ధరణి పోర్టల్ ఓ లెక్కా. భూ భారతి కూడా వారి దృష్టిలో బలాదూరే. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ప్రజలకు భరోసా కల్పించాలి. వారి భూములకు రెక్కలు రాకుండా చూడాలి. భూ బకాసురులపైన అత్యంత కఠినంగా వ్యవహరించాలి. ప్రజల్లో విశ్వాసం పెంచాలి. ఇదే ప్రజల ఆశ... ఆకాంక్ష...



జీ. వెంకటరమణ
సీనియర్ జర్నలిస్ట్

# ఇండోపసిఫిక్ ప్రాంతంలో సరికొత్త భౌగోళిక రాజకీయం

**ఇండో-పసిఫిక్ ప్రాంతంలో సరికొత్త భౌగోళిక రాజకీయం**

భారతదేశం, ఇండోనేసియా దేశాల మధ్య తాజాగా కుదిరిన ఒప్పందాలు ఒక బలమైన బంధాన్ని సూచిస్తున్నాయి. కేవలం రక్షణ లేదా వాణిజ్య సంబంధాలు మాత్రమే కావు ఇవి. ఇండోపసిఫిక్ ప్రాంతంలో మారుతున్న భౌగోళిక రాజకీయాలకు నిదర్శనం. ఆసియాలోని రెండు ప్రజాస్వామ్య బృహత్తర శక్తులు, ఒకే విధమైన భవిష్యత్తు లక్ష్యాలతో చేతులు కలపడం అంతర్జాతీయ వేదికపై పెను సంచలనం. భారత రక్షణ ఎగుమతుల్లో 'బ్రహ్మోస్', 'అస్త్ర' క్షిపణుల ఎగుమతి ఒక కీలక మలుపు. రూ. 5,600 కోట్ల విలువైన ఈ ఒప్పందం, రక్షణ రంగంలో భారతదేశం సాధించిన స్వావలంబనకు ప్రతీక. ముఖ్యంగా, రక్షణ పరికరాల కొనుగోలుదారుగా ఉన్న భారత్, ఇప్పుడు ప్రపంచ దేశాలకు నమ్మకమైన ఆయుధ సరఫరాదారుగా ఎదుగుతోంది. సబాంగ్ ఓడరేవు అభివృద్ధి, నౌకల ఉమ్మడి నిర్మాణం వంటి నిర్ణయాలు, హిందూ మహాసముద్ర ప్రాంతంలో చైనా విస్తరణవాదాన్ని అడ్డుకోవడంలో వ్యూహాత్మక సమతుల్యతను తీసుకువస్తాయి. ఖనిజ సంపద పారిశ్రామిక తోడ్పాటు: నికెల్, అరుదైన ఖనిజాల విషయంలో ఇండోనేసియాకున్న పట్టును, భారత తయారీ రంగంతో అనుసంధానించడం అత్యంత దూర దృష్టితో కూడిన నిర్ణయం. ఎలక్ట్రిక్ వాహనాలు , స్మార్ట్‌ఫోన్ల తయారీకి అవసరమైన ముడి పదార్థాల సరఫరాలో ఇండోనేసియా భారత్‌కు నమ్మకమైన భాగస్వామిగా మారుతుంది. భారత యూపీఐ ని ఇండోనేసియా చెల్లింపుల వ్యవస్థతో అనుసంధానించడం ద్వారా డిజిటల్ ఆర్థిక వ్యవస్థను ఉభయ దేశాలు మరింత బలోపేతం చేయనున్నాయి. ఇది చిన్న, మధ్యతరహా వ్యాపారులకు ఎంతో ఊరటనిచ్చే అంశం.

ఇండోనేసియాలో 'ఐఐఎంబెంగళూరు' క్యాంపస్ ఏర్పాటు చేయడం ద్వారా విద్యా రంగంలో భారతీయ ప్రతిభను ప్రపంచవ్యాప్తం చేయాలన్న లక్ష్యం నెరవేరుతోంది. ఇది రెండు దేశాల యువత మధ్య నైపుణ్యాభివృద్ధికి, సాంస్కృతిక వారధికి బాటలు వేస్తుంది.

ప్రజాస్వామ్య విలువలు, సముద్ర భద్రత, ఆర్థిక స్థిరత్వం అనే మూడు సూత్రాలపై ఆధారపడి ఉన్న ఈ ద్వైపాక్షిక బంధం, భవిష్యత్తులో ఆగ్నేయాసియాలో భారతదేశ ప్రాముఖ్యతను రెట్టింపు చేస్తుంది. అయితే, ఆయా ఒప్పందాల అమలులో వేగం, పారదర్శకత చాలా ముఖ్యం. ప్రజాస్వామ్య దేశాల మధ్య జరిగే ఇటువంటి సహకారాలు, అంతర్జాతీయ రాజకీయాల్లో ఒక భద్రతను, సమతుల్యతను చేకూరుస్తాయి.

ప్రధాని మోదీ, అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో నేతృత్వంలో జరిగిన ఈ ఒప్పందాలు, కేవలం కాగితాలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో వాస్తవరూపం దాల్చాలి. భారత్ఇండోనేసియా సంబంధాలు కేవలం రెండు దేశాల ప్రయోజనమే కాకుండా, ఇండోపసిఫిక్ ప్రాంతంలో శాంతికి, సుస్థిరతకు, సమగ్ర అభివృద్ధికి 'బ్రహ్మాస్త్రం'లా పనిచేస్తాయనడంలో సందేహం లేదు. భారత్ తన "యాక్ట్ ఈస్ట్" విధానాన్ని మరింత వేగవంతం చేసి, ఆసియా దిశగా తన ప్రభావాన్ని బలోపేతం చేసుకోవడానికి ఇది సరైన సమయం.






# మద్యం.. కాలేయానికే కాదు మెదడుకూ ముప్పు

మద్యం సేవించడం వల్ల కాలేయం, గుండె వంటి అవయవాలకే నష్టం జరుగుతుందని చాలా మంది భావిస్తుంటారు. అయితే మద్యం ప్రభావం శరీరంలోని అత్యంత కీలక అవయవమైన మెదడుపైనా తీవ్రంగా ఉంటుందని న్యూరాలజీ నిపుణులు హెచ్చరిస్తున్నారు. అప్పుడప్పుడు మద్యం సేవించినా, తరచూ లేదా అధిక మోతాదులో తీసుకుంటే మెదడు పనితీరు క్రమంగా దెబ్బతింటుందని చెబుతున్నారు. ముఖ్యంగా జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, ఆలోచనా సామర్థ్యం, నిర్ణయాలు తీసుకునే నైపుణ్యం, భావోద్వేగాల నియంత్రణ, నిద్ర నాణ్యత వంటి అనేక అంశాలపై ప్రతికూల ప్రభావం పడుతుంది. దీర్ఘకాలంగా మద్యం అలవాటుగా మారితే మెదడు నిర్మాణంలోనూ మార్పులు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు పేర్కొంటున్నారు.

**జ్ఞాపకశక్తిని దెబ్బతీసే మద్యం**

మన మెదడులో జ్ఞాపకశక్తి, కొత్త విషయాలను నేర్చుకునే సామర్థ్యానికి అత్యంత కీలకమైన భాగం హిప్పోక్యాంపస్**. మద్యం మొదట ప్రభావం చూపే ప్రాంతాల్లో ఇదొకటి. సాధారణంగా మనం చూసిన, విన్న విషయాలను తాత్కాలిక జ్ఞాపకాల నుంచి దీర్ఘకాలిక జ్ఞాపకాలుగా మార్చే ప్రక్రియ ఈ భాగంలోనే జరుగుతుంది. కానీ అధికంగా మద్యం సేవిస్తే ఈ ప్రక్రియలో అంతరాయం ఏర్పడుతుంది. ఫలితంగా కొందరికి **'బ్లాక్అవుట్స్'** వస్తాయి. అంటే మద్యం సేవించిన సమయంలో జరిగిన సంఘటనలు, మాట్లాడిన మాటలు, కలిసిన వ్యక్తులు పూర్తిగా గుర్తుండకపోవచ్చు.

**మెదడు ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవాలి?**

మెదడు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే మద్యం సేవించడం తగ్గించడం లేదా పూర్తిగా మానేయడం ఉత్తమ మార్గమని వైద్యులు సూచిస్తున్నారు. అలాగే ప్రతిరోజూ తగినంత నిద్రపోవడం, సమతుల్య ఆహారం తీసుకోవడం, విటమిన్B1తో పాటు ఇతర పోషకాలు సమృద్ధిగా ఉండే ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, ఒత్తిడిని నియంత్రించుకోవడం వంటి అలవాట్లు మెదడు పనితీరును మెరుగుపరుస్తాయి.తరచూ మతిమరుపు, ఏకాగ్రత తగ్గడం, ఆలోచనలు మందగించడం, మాటలు గుర్తుకురాకపోవడం, రోజువారీ పనుల్లో ఇబ్బందులు ఎదురవుతుంటే వాటిని సాధారణ సమస్యలుగా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే న్యూరాలజిస్టును లేదా వైద్య నిపుణులను సంప్రదించడం మంచిదని వారు సూచిస్తున్నారు.

ఇది కేవలం ఒక్కరోజు సమస్య మాత్రమే కాదు. సంవత్సరాల పాటు మద్యం సేవించే అలవాటు ఉంటే జ్ఞాపకశక్తి క్రమంగా బలహీనపడటంతో పాటు కొత్త విషయాలను గుర్తుంచుకోవడం కూడా కష్టమవుతుంది. వృద్ధాప్యంలో వచ్చే మతిమరుపు సమస్యలు మరింత వేగంగా వచ్చే అవకాశమూ ఉందని నిపుణులు చెబుతున్నారు.

**నిర్ణయాలు తీసుకునే సామర్థ్యంపై ప్రభావం**

మద్యం మెదడులోని **ఫ్రంటల్ లోబ్** పనితీరును కూడా ప్రభావితం చేస్తుంది. ఈ భాగమే మన ఆలోచనలు, ప్రణాళికలు, నిర్ణయాలు, సమస్యల పరిష్కారం, భావోద్వేగాల నియంత్రణ వంటి ముఖ్యమైన పనులను నిర్వహిస్తుంది. మద్యం మత్తులో ఉన్నప్పుడు సరైన నిర్ణయాలు తీసుకోలేకపోవడం, ప్రమాదకర ప్రవర్తనకు పాల్పడడం, కోపం లేదా ఆవేశాన్ని అదుపు చేసుకోలేకపోవడం దీనివల్లే జరుగుతుంది.తరచూ మద్యం సేవించే వారిలో సంభాషణలను సరిగ్గా అర్థం చేసుకోవడం, వ్యక్తుల పేర్లు గుర్తుంచుకోవడం, క్లిష్టమైన పనులను పూర్తి చేయడం, ఏకాగ్రతతో పనిచేయడం క్రమంగా కష్టమవుతాయి. ఉద్యోగాలు, వ్యాపారాలు, చదువుల్లోనూ ఈ ప్రభావం స్పష్టంగా కనిపించే అవకాశం ఉంటుంది.

**నిద్రపట్టినా.. విశ్రాంతి ఉండదు**

చాలామంది మద్యం తాగితే త్వరగా నిద్ర వస్తుందని నమ్ముతుంటారు. నిజానికి అది కేవలం తాత్కాలిక మత్తు మాత్రమే. మద్యం వల్ల గాఢ నిద్ర (డీప్ స్లీప్), అలాగే మెదడు విశ్రాంతి పొందేందుకు అవసరమైన నిద్ర దశకు ఆటంకం ఏర్పడుతుంది. దీంతో నిద్రపోయినా శరీరం, మెదడు పూర్తిగా విశ్రాంతి పొందవు. దీని ప్రభావంగా మరుసటి రోజు అలసట, చిరాకు, ఏకాగ్రత లోపం, పనితీరు తగ్గడం, నిర్ణయ సామర్థ్యం మందగించడం వంటి సమస్యలు ఎదురవుతాయి. ఎక్కువకాలం ఇదే పరిస్థితి కొనసాగితే మానసిక ఆరోగ్యంపైనా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది.



## కాప్రాలో అక్రమ వైన్ తయారీ గుట్టురట్టు

- 377.7 లీటర్ల నకిలీ ఫ్రూట్ వైన్ స్వాధీనం.. 502 బాటిళ్లు సీజ్
- ఏడు రకాల పండ్లతో అక్రమ తయారీ.. ఒక్కో బాటిల్ రూ.300కు విక్రయం
- 65 ఏళ్ల ఆంథోనీ పీటర్ అరెస్ట్

**కుషాయిగూడ, మహా :** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ (డీటీఎఫ్) అధికారులు నిర్వహించిన మెరుపు దాడుల్లో కాప్రా పరిధిలో అక్రమంగా ఫ్రూట్ వైన్ తయారు చేసి విక్రయిస్తున్న ముఠా గుట్టును రట్టు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు రాత్రి నిర్వహించిన ప్రత్యేక దాడుల్లో భారీ మొత్తంలో అక్రమంగా తయారు చేసిన వైన్‌ను స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేశారు. అధికారుల వివరాల ప్రకారం, నిందితుడు ఆంథోనీ పీటర్ (65), నేరేడ్‌మెట్ నివాసి, కాప్రా పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా వివిధ రకాల పండ్లతో వైన్ తయారు చేసి ఒక్కో బాటిల్‌ను రూ.300 చొప్పున విక్రయిస్తున్నట్లు గుర్తించారు. దాడుల్లో మొత్తం 377.7 లీటర్ల అక్రమ వైన్, 502 బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వైన్‌ను ద్రాక్ష, అనాసపండు, జామ, మొసంబి, సపోటా, అరటి, తమలపాకు వంటి ఏడు రకాల పదార్థాలతో తయారు చేసినట్లు అధికారులు వెల్లడించారు. నిందితుడిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు కోసం కాప్రా ఎక్సైజ్ స్టేషన్ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

## శరణు ఘోషతో మారుమోగిన... బాలాజీ నగర్ అయ్యప్ప దేవాలయం.

- తత్వ మసి ఆరాధనలో అయ్యప్ప భక్తులు.
- ఘనంగా అయ్యప్ప స్వామి 11వ వార్షికోత్సవ వేడుకలు.
- ఆలయ కమిటీ ప్రెసిడెంట్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా



**కుషాయిగూడ, మహా :** పల్లి కట్టు శబరిమలకు కళ్ళుం, ముళ్ళుం, కాలికి మెట్టె స్వామియే అయ్యప్ప అంటూ శరణు ఘోషతో బాలాజీ నగర్ లోని అయ్యప్ప స్వామి దేవాలయం మార్మోగింది. బాలాజీ నగర్ లో ఘనంగా అయ్యప్ప స్వామి 11వ వార్షికోత్సవ వేడుకలు ఆలయ చైర్మన్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా ఆధ్వర్యంలో బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు జవహర్ నగర్ పరిధిలోని భక్తులు నాయకులు, బాలాజీ నగర్ లో కొలువైన శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయ 11 వ వార్షికోత్సవ వేడుకలకు స్వామివారి దేవాలయం నిత్య అలంకరణలతో దేదీప్యమానంగా వెలుగొందుతూ కన్నుల పండుగ వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. ప్రత్యేక పూజలు హోమాలు: శ్రీ అయ్యప్ప స్వామి 11వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం తెల్లవారుజాము నుంచి ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మొదటగా గణపతి హోమం మొదలు కాగా స్వామివారికి ఘనంగా అభిషేకాలు హోమాలు నిర్వహించారు. విద్యుత్ దీపాల రంగురంగుల అలంకరణలతో అయ్యప్ప దేవాలయం పుష్పాలతో శోభాయామానంగా అలంకరించడంతో భక్తులు భక్తి గీతాలతో ఆలయ ప్రాంగణం మారు మోగింది.t

# అధికారులకు కాసులు 111 జీవోకు తూట్లు...



**రాజేంద్రనగర్ మహా :** గ్రేటర్ జంట జలాశయాలైన ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ పరిరక్షణ కోసం తెచ్చిన 111 జీవో నిబంధనలకు తూట్లు పొడుస్తూన్నారు, అధికారులకు కాసులు ఇస్తే చాలు అనుమతులు అవసరం లేకుండానే బహుళ అంతస్తుల నిర్మాణాలు కొనసాగించవచ్చు అనే ధీమాతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఉన్నారు. 111 జీవో కు తుట్లు పొడుస్తూ శంషాబాద్ సర్కిల్ పరిధిలోని రాల్లగూడలో బహుళ అంతస్తుల అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు జిహెచ్ఎంసి అధికారులకు పలుసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకునే నాధుడు కరువయ్యారని స్థానికులు వాపోయ్యారు.గొలుసు కట్టు చెరువులను, కుంటలను పూడ్చేస్తూ భారీ వ్యాపార సముదాయాలు నిర్మిస్తున్నారు. నిర్మాణదారులకు తూతూ మంత్రంగా నోటీసులతో కాలయాపన చేస్తున్నారని స్థానికు ప్రజలు మండిపడుతున్నారు. శంషాబాద్ సర్కిల్ పరిధిలో జీవో కు విరుద్ధంగా అక్రమ భవనాలు వాణిజ్య సముదాయాలు నిర్మిస్తున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తూ ఉండడంతో అక్రమ నిర్మాణాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. జంట జలాశయాల పరిధిలో పర్యావరణాన్ని పరిరక్షించేందుకు నాటి ప్రభుత్వం జారీ చేసిన 111 జీవో ను పరిరక్షించవలసిన అధికారులు కాసులకు కక్కుర్తి పడి పర్యావరణ నాశనానికి కారకులవుతున్నారు.గ్రేటర్ శంషాబాద్ లో వందల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. కాసులకు ఆశ పడితే భవిష్యత్తులో పెను ప్రమాదాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు

## మున్సిపల్ ఎజెండా అంశాల ఆమోదం

ఆదిలాబాద్ మహా : గత నెలలో ఆదిలాబాద్ మున్సిపల్ సర్వసభ సమావేశం వాయిదా పడినా ఎజెండా అంశాలను కలెక్టర్ రాజర్షిషా ఆమోదించారని ఛైర్‌పర్సన్ బండారి అనూష తెలిపారు.బుధవారం తన నివాసంలో ఆమె మీడియాతో మాట్లాడారు. ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు,అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి సూచనల మేరకు ఆయా ఎజెండా అంశాలను ఆమోదం కోసం జిల్లా కలెక్టర్ కు పంపించినట్టు తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని రూ.50 లక్షలతో ఇంకుడు గుంతల ఏర్పాటు, రూ.90 లక్షలతో సానిటేషన్ వాహనాల కొనుగోలు, హరితహారం కార్యక్రమం కోసం రూ.35 లక్షల నిధులు, అదేవిధంగా 49 వార్డుల్లో రూ.3.5 లక్షల చొప్పున నిర్వహించనున్న "99 డేస్ పట్టణ ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి సంబంధించిన బిల్లులతో పాటు మున్సిపాలిటీకి సంబంధించిన ఇతర ఎజెండా అంశాలను ఆమోదించారని తెలిపారు. ఎజెండా అంశాల ఆమోదానికి సహకరించిన మంత్రి జూపల్లి కృష్ణారావు ,అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి తో సహా ఎజెండా అంశాలను ఆమోదించిన జిల్లా కలెక్టర్ కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.



## ఎమ్మెల్యే పై మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి విమర్శలు!

- భూకబ్జాకు కుట్ర అంటూ ఎమ్మెల్యే పై ఆగ్రహం వ్యక్తం
- అధికారులు ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి
- ప్రజా ప్రయోజనాల కోసం ఉపయోగించాలి: మాజీ ఎమ్మెల్యే

**ఇబ్రహీంపట్నం జూలై 8 మహా:** మునగనూరులో కోట్లు ప్రభుత్వ భూమి కబ్జాకు కుట్ర పన్నుతున్నారని మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యేను తీవ్రస్థాయిలో విమర్శించారు. రంగారెడ్డి జిల్లా, జిహెచ్ఎంసి ఆదిభట్ల సర్కిల్, తొర్రూరు డివిజన్ పరిధిలోని మునగనూరు గ్రామం సర్వే నంబర్ 44లో సుమారు 12 ఎకరాల ప్రభుత్వ భూమిని అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు అక్రమంగా కబ్జా చేసి, రాత్రికి రాత్రే రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. బుధవారం మునగనూరులోని ప్రభుత్వ భూమిని తిరిగి పరిశీలించారు. ఆ యొక్క భూమి వద్ద బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆందోళన చేపట్టారు. అనంతరం మంచిరెడ్డి కిషన్ రెడ్డి మాట్లాడుతూ... దాదాపు రూ.200 కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తిని అధికార బలం, అధికార యంత్రాంగాన్ని అడ్డుపెట్టుకుని కొల్లగొట్టే కుట్ర జరుగుతోందని మండిపడ్డారు. ప్రజల ఆస్తులను కాపాడాల్సిన ఎమ్మెల్యే, ఎంపీలే రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ అధికారులను ఒత్తిడికి గురిచేసి రాత్రికి రాత్రే అక్రమ రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని ఆరోపించారు. రెవిన్యూ అధికారులు ప్రభుత్వ భూములను వెంటనే స్వాధీనం చేసుకుని ప్రజా ప్రయోజనాల కోసం పార్కులు, ఓపెన్ జిమ్‌లు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి వినియోగించాలనీ జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో అధికారులు విఫలమైతే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దండెం రామ్‌రెడ్డి, వంగేటి లక్ష్మారెడ్డి, బొక్క గౌతంరెడ్డి, కాకుమాను చెన్నయ్య, బిందు రంగారెడ్డి, సంపతీశ్వర్ రెడ్డి, మోహన్ గుప్తా, ప్రభు వర్ధన్ రెడ్డి, కళ్యాణ్ నాయక్, కొత్త కిషన్ గౌడ్, శశివర్ధన్ రెడ్డి, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



## సమతామూర్తిని దర్శించుకున్న కేంద్ర జాయింట్ సెక్రటరీ కుటుంబ సభ్యులు..

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ మండలం ముచ్చింతల్ శ్రీరామ్ నగర్ లో కేంద్ర సమాచార, ప్రసార శాఖ జాయింట్ సెక్రటరీ పృథుల్ కుమార్ బుధవారం తను కుటుంబ సమేతంగా సమతామూర్తి (స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ) నీసందర్శించారు. 216 అడుగుల ఎత్తయిన భగవద్ రామానుజాచార్యుల విగ్రహాన్ని దర్శించుకున్నారు. ఆవరణలోని 108 దివ్యదేశాల నమూనా ఆలయాలను, భద్రవేదిలోని డిజిటల్ లైబ్రరీ, సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించారు. ఆలయ అర్చకులు వారికి తీర్థప్రసాదాలను అందజేశారు. సమతామూర్తి కేంద్ర విశిష్టత, రామానుజాచార్యుల సమానత్వ సందేశం అద్భుతంగా ఉన్నాయన్నారు.



## దొంగ దొరికాడు

- వివరాలు వెల్లడించిన డీఎస్పీ

**ఆదిలాబాద్ మహా :** జల్సాలకు అలవాటు పడి ఆదిలాబాద్ జిల్లాలోని పలు ఆలయాల్లో వరుస చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని అరెస్ట్ చేసినట్టు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్ కు చెందిన నిందితుడు కొలాయం కాశీనాథ్ ను అరెస్ట్ చేసి 30 తులాల వెండి, 2.5 గ్రాముల బంగారు ఆభరణాలు, మోటార్ సైకిల్, 2 మొబైల్ ఫోన్లు, నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. బుధవారం ఆదిలాబాద్ పట్టణంలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో నిందితుడు అనుమానాస్పదంగా సంచరిస్తుండగా పోలీసులు ఆపేందుకు ప్రయత్నించగా పారిపోవడానికి యత్నించాడన్నారు. పట్టుకుని విచారించగా పలు ఆలయాల్లో చోరీలకు పాల్పడినట్లు తేలిందని తెలిపారు. విచారణలో నిందితుడు మొత్తం 11 కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు తేలిందన్నారు.చోరీ చేసిన బంగారం, వెండి వస్తువులను ఆదిలాబాద్ అశోక్ రోడ్డులోని బంగారు వ్యాపారి లోకాజీ విశ్వనాథ్ వద్ద విక్రయించేవాడని, చోరీ సొత్తు అని తెలిసినా కొనుగోలు చేసినందుకు అతనిపై కూడా కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఆలయాలు, ప్రార్థనా స్థలాల్లో చోరీలకు పాల్పడే వారిపై, అలాగే చోరీ సొత్తు కొనుగోలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకొనబడతాయని డీఎస్పీ హెచ్చరించారు.



## బహదూర్ గూడ రైతులకు అండగా సిపిఐ పార్టీ ఉంటుంది

- సాగు చేస్తూన్న రైతులకు 1350 ఎకరాల భూమిని పంచాలి..
- సిపిఐ రాష్ట్ర నాయకులు పానుగంటి పర్వతాలు...

రాజేంద్రనగర్ మహా ; శంషాబాద్ పరిధిలోని బహదూర్ గుడా భూములలో బుల్లెట్ రైలు, బస్ టెర్మినల్ మెట్రో రైల్ కోసం పంటలు పండించే రైతుల భూములను నిబంధనలకు విరుద్ధంగా లోపాయికారు ఒప్పందంతోరైతులను మోసం చేస్తూ ప్రభుత్వం తీసుకుంటున్న భూములను వెంటనే విరమించుకోవాలని సిపిఐ రాష్ట్ర నాయకులు పానుగంటి పర్వతాలు డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర నాయకులు ప్రకటన విడుదల చేశారు. రైతులకు అన్యాయం చేసిన బహదూర్ గూడ రైతుల పక్షాన సిపిఐ భూపోరాటాలు, ఆందోళనలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తాతల తండ్రుల కాలం నుంచి సుమారు 1350 ఎకరాలు ప్రభుత్వం ఆనాడు పేదలకు భూములు ఇచ్చింది. ఆనాటి నుండి నేటి వరకు రైతులు ఆ భూములలో పంటలు పండించుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. పట్టా పాస్ బుక్కు లతో సంబంధం లేకుండా వర్షాన్ని నమ్ముకుని వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు.రాష్ట్ర ప్రభుత్వం

**అధికారులను ఉసిగొలిపి**

పహని,కాస్రా, భూ రికార్డులను పరిశీలిస్తూ రైతులకు పంగనామాలు పెట్టే ప్రయత్నం చేస్తుందని సిపిఐ నాయకులు పర్వతాలు మండిపడ్డారు.పట్టాలు ఉన్న వారికి మాత్రమే ప్రభుత్వం నుండి సహకారం ఉంటుందని పట్టాలు లేని వారికి ఎలాంటి సహకారం ఉండదని ఉన్నత స్థాయిలో ఉన్న ఎమ్మార్వో చెప్పడం బాధాకరమన్నారు. ప్రభుత్వ అధికారులు ఎలాంటి పక్షపాత ధోరణి ప్రదర్శించకుండా ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించకుండా రైతులఅందరికీ సమాన న్యాయం జరిగే విధంగా చూడాలని సిపిఐ రాష్ట్ర నాయకులు పర్వతాలు కోరారు. రైతులకు అన్యాయం జరిగితే కమ్యూనిస్టు పార్టీ చూస్తూ ఊరుకునేదిలేదు రైతుల పక్షాన ఆందోళనలు పోరాటాలు చేస్తామన్నారు

## అక్రమ నిర్మాణాల కూల్చివేత

**భూకబ్జాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు**
**తాసిల్దార్ యాదగిరి రెడ్డి హెచ్చరిక**

రూ.3.5 కోట్ల విలువైన సీలింగ్ భూమిని పరిరక్షించిన కీసర రెవెన్యూ-హైడ్రా అధికారులుకుషాయిగూడ, మహా : కీసర రెవెన్యూ పరిధిలోని నాగారం గ్రామంలోని సర్వే నంబర్ 87/2లో ఉన్న ప్రభుత్వ సీలింగ్ భూమిపై చేపట్టిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ, హైడ్రా అధికారులు గురువారం కూల్చివేశారు. గ్రామ పెద్దలు జిల్లా కలెక్టర్, కీసర తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో అధికారులు విచారణ చేపట్టి ఆక్రమణలను తొలగించారు.అధికారుల సర్వేలో సంబంధిత భూమి ప్రభుత్వ సీలింగ్ భూమిగా నిర్ధారణ కావడంతో యంత్రాల సహాయంతో నిర్మాణాలను తొలగించారు. దీంతో సుమారు రూ.3.5 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణ నుంచి రక్షించబడిందని అధికారులు తెలిపారు. ఈ చర్యపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కీసర తహసీల్దార్ యాదగిరి రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ భూమిపై కొందరు అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నట్లు ఫిర్యాదులు అందాయని చెప్పారు. రెవెన్యూ సిబ్బంది నిర్వహించిన సర్వేలో అది ప్రభుత్వ సీలింగ్ భూమిగా తేలిందన్నారు. గతంలో మున్సిపల్ శాఖ నుంచి మంజూరైన నిర్మాణ అనుమతులను రద్దు చేయాలని ఇప్పటికే లేఖ ద్వారా కోరినట్లు తెలిపారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని భూకబ్జాదారుల కు కీసర తాసిల్దార్ యాదగిరి రెడ్డి హెచ్చరించారు.



## ఫ్యూచర్ సిటీ రహదారి భూసేకరణకు మేడిపల్లి గ్రామస్తుల సమ్మతి

- పరిహారం పై అంగీకారం తెలుపుతూ సమ్మతి పత్రాలు అందజేత
- మేడిపల్లి రైతులకు న్యాయం చేస్తాం: అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఫ్యూచర్ సిటీకి అనుసంధానంగా నిర్మించనున్న రహదారికి అవసరమైన భూసేకరణ ప్రక్రియలో భాగంగా బుధవారం సమీకృత జిల్లా కార్యాలయంలో రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మేడిపల్లి గ్రామస్తులతో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి ఛాంబర్ లో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... భూసేకరణ ప్రక్రియ, పరిహారం చెల్లింపు, ప్రభుత్వ నిబంధనలు, రైతులకు కల్పించబడుతున్న ప్రయోజనాల పై గ్రామస్తులకు సమగ్రంగా వివరించారు. అనంతరం గ్రామస్తులతో నిర్వహించిన చర్చలు సానుకూల వాతావరణంలో జరిగాయి.

ప్రభుత్వం ప్రకటించిన పరిహారంపై గ్రామస్తులు అంగీకారం వ్యక్తం చేస్తూ తమ సమ్మతి పత్రాలను (Consent Petitions) అదనపు కలెక్టర్‌కు అందజేశారు. భూసేకరణ ప్రక్రియను పరస్పర అవగాహనతో, పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేసేందుకు సహకరించిన గ్రామస్తులకు అదనపు కలెక్టర్ అభినందనలు తెలియజేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో సంబంధిత రెవెన్యూ అధికారులు, భూసేకరణ అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.



## దాసి శంకర్ కు ఆత్మీయ సన్మానం...

**యాదాద్రి భువనగిరి జులై 8 మహా**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు చేనేత సహకార సంఘం చైర్మన్ గా ఏకగ్రీవంగా ఎన్నికైన పాత్రికేయుడు దాసి శంకర్ ను ఆలేరు రహదారి బంగ్లాలో బుధవారం జర్నలిస్టులు పలువురు రాజకీయ నాయకులు శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించారు చేనేత కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా చైర్మన్ శంకర్ కృషి చేయాలని జర్నలిస్టులు శంకరును కోరారు.

## భార్య ముందే ప్రియురాలితో భర్త ఆత్మహత్యాయత్నం

**కుషాయిగూడ, మహా** : భార్య ఎదుటే ప్రియురాలితో కలిసి భర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో కలకలం రేపింది. రైలులో ప్రయాణిస్తున్న సమయంలో ఇద్దరూ విషపదార్థం సేవించి అపస్మారక స్థితికి చేరుకోగా, అప్రమత్తమైన రైల్వే పోలీసులు వెంటనే గాంధీ ఆస్పత్రికి తరలించి ప్రాణాలు కాపాడారు.రైల్వే పోలీసుల వివరాల ప్రకారం శ్రీకాకుళం జిల్లా మెలియాపుట్టి మండలం చాపర గ్రామానికి చెందిన శ్రీరామ్ శిరీష్ కుమార్ (34)కు భార్య సులోచన, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇదే గ్రామానికి చెందిన గులివెందుల నీలవేణి (34)తో గత రెండు నెలలుగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. సుమారు నెల రోజుల క్రితం ఇద్దరూ గ్రామం విడిచి కోయంబత్తూరుకు వెళ్లిపోయారు. వారి ఆచూకీ తెలుసుకున్న శిరీష్ కుమార్ భార్య సులోచన కోయంబత్తూరుకు వెళ్లి ఇద్దరినీ కలిసి మాట్లాడి, కుటుంబ సభ్యుల సమక్షంలో హైదరాబాద్‌కు తిరిగి రావాలని ఒప్పించింది.ఈ క్రమంలో వారంతా సబరి ఎక్స్‌ప్రెస్లో కోయంబత్తూరు నుంచి సికింద్రాబాద్‌కు బయలుదేరారు. రైలు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకునే లోపు శిరీష్ కుమార్, నీలవేణి ఇద్దరూ విషపదార్థం సేవించి అపస్మారక స్థితికి చేరుకున్నారు.విషయం తెలుసుకున్న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ డిప్యూటీ స్టేషన్ సూపరింటెండెంట్ ఎం.బి.ఎస్. కుమారి సమాచారం మేరకు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) సిబ్బంది వెంటనే జనరల్ బోగీకి చేరుకుని, 108 అంబులెన్స్ ద్వారా ఇద్దరినీ అత్యవసర చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఇద్దరూ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు వైద్యులు తెలిపారు.



## భూటాన్‌తో ఈసీఐఎల్ వాణిజ్య ఒప్పందం

**ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లను సరఫరా చేయనున్న ఈసీఐఎల్**

**కుషాయిగూడ, మహా** : హైదరాబాద్‌కు చెందిన ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్) మరో అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకుంది. భూటాన్ ఎన్నికల సంఘంతో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల (ఈవీఎంలు) సరఫరాకు సంబంధించి ఒప్పందంపై సంతకాలు జరిగాయి.భూటాన్ రాజధాని తింపూలో బుధవారం జరిగిన కార్యక్రమంలో భూటాన్ ఎన్నికల కమిషనర్ సోనం పెల్డెన్ తాయే, ఈసీఐఎల్ సీఎండీ, డైరెక్టర్ (టెక్నికల్) డాక్టర్ అనీష్ కుమార్ శర్మ వాణిజ్య ఒప్పంద పత్రాలను పరస్పరం మార్చుకున్నారు. ఈ ఒప్పందం మేరకు భూటాన్‌లో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లను ఈసీఐఎల్ సరఫరా చేయనుంది .ఈ కార్యక్రమంలో భూటాన్ ఎన్నికల సంఘం డైరెక్టర్ గోవిందా సుబేది, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సోనం వంగడా, ఈసీఐఎల్ ఈవీఎం డివిజన్ ఇన్‌చార్జ్ లెఫ్టినెంట్ కల్నల్ ఆర్.ఎస్. బీన్స్ (రిటైర్డ్)తో పాటు ఇరు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



# విద్యాశాఖ పై సమీక్ష సమావేశం



**ఆదిలాబాద్ మహా :** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని జిల్లా కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యాశాఖ ప్రగతి, పాఠశాలల్లో వసతుల కల్పన, పురోగతిపై ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గత విద్యా సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల నమోదును 30 శాతం పెంచడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు, అధికారులు దృషి సారించాలని ఆదేశించారు. ఇందుకోసం క్షేత్రస్థాయిలో ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. బడి పిల్లలకు అందించే మధ్యాహ్న భోజన పథకం సజావుగా సాగడానికి జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఎల్‌పీజీ గ్యాస్ కనెక్షన్లు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. డిజిటల్ విద్యా విస్తరణలో భాగంగా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన బీఎస్ఎన్ఎల్ ఇంటర్నెట్ కనెక్షన్లు నిరంతరం పనిచేసేలా పర్యవేక్షించాలన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన పనుల్లో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.అనంతరం పదవీవిరమణ పొందిన ఉద్యోగులను కలెక్టర్, అధికారులు శాలువాలతో సత్కరించి పదవీ విరమణకు సంబంధించిన మెమంటో పత్రాన్ని అందజేశారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రాజేశ్వర్, చిత్రు, డీఈఓ మాధవి, డీఆర్‌డీఓ రవీందర్, మండలాల విద్యాశాఖాధికారులు, సెక్టోరల్ అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# ఇడుపులపాయకు ఆదిలాబాద్ కాంగ్రెస్ నేత

**ఆదిలాబాద్ మహా**: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి సందర్భంగా కడప జిల్లా ఇడుపులపాయలోని వైఎస్ సమాధి వద్ద జరిగిన నివాళి కార్యక్రమానికి ఆదిలాబాద్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మాజీ టీటీడీ ఎల్ఏసీ మెంబర్ బెజ్జంకి అనిల్ కుమార్ హాజయ్యారు. వైఎస్ఆర్ కుటుంబ సభ్యులతో కలిసి మహానేత సమాధి ని దర్శించుకున్నారు. పూల మాలలు వేసి ఘన నివాళ్లు అర్పించారు.అనంతరం వైఎస్ ఆర్ సతీమణి విజయమ్మ, కూతురు వైఎస్ షర్మిలను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈయన కాంగ్రెస్ పార్టీ పై వైఎస్ ఆర్ పై ఉన్న అభిమానంతో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యే దాకా పాద రక్షలు ధరించనని 2009 లో ప్రతిన బూని దాదాపు పది సంవత్సరాలు కాళ్లకు చెప్పులు లేకుండా తిరిగారు.దీంతో వైఎస్ ఎస్ ఆర్ కుటుంబ సభ్యులకు దగ్గరయ్యారు. అనంతరం వైఎస్ఆర్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం ఆదిలాబాద్ లో కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తున్నారు.



# సీఎం రేవంత్ రెడ్డికి పాలాభిషేకం

**యాదాద్రి భువనగిరి జూలై 8 మహా**

రైతు సంక్షేమమే ధ్యేయంగా గత తొమ్మిది రోజులుగా 9000 కోట్ల రైతు భరోసాను రైతుల అకౌంట్లో వేసిన ప్రజా పాలన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య చిత్రపటాలకు బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేశారు...

ఇందిరా కాంగ్రెస్ భవన్ నుంచి కాంగ్రెస్ నాయకులు రైతులు ర్యాలీగా ఆలేరు బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు అనంతరం సీఎం, మంత్రి, ఎమ్మెల్యే చిత్రపటాలకు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జనగామ ఉపేందర్ రెడ్డి, ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఈరసరపు యాదగిరి గౌడ్, ఆలేరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు గంధమల్ల అశోక్, ఆలేరు మున్సిపల్ చైర్మన్ బీజాన బాలమణి భాస్కర్, వైస్ చైర్మన్ అంగిడి ఆంజనేయులు , పలువురు కౌన్సిలర్లు,జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు నీలం పద్మ, పట్టణ అధ్యక్షులు సాగర్ రెడ్డి, పలువురు కోఆప్షన్ సభ్యులు, ప్రజా ప్రతినిధులు,వివిధ గ్రామాలకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాయకులు

పాలాభిషేకం చేశారు... ఈ సందర్భంగా రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వవిప్ బీర్ల ఐలయ్యలకు కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఘనంగా స్వర్గీయ డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి



యాదాద్రి భువనగిరి జూలై 8 మహా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి 77వ జయంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం గూడూరు టోల్ ప్లాజా వద్ద వైయస్సార్ విగ్రహానికి భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ప్రజా సంక్షేమానికి జీవితాంతం అంకితభావంతో పనిచేసిన మహానేత అని కొనియాడారు. రైతులు, పేదలు, మహిళలు, విద్యార్థులు, వృద్ధులు సహా సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతి కోసం ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నేటికీ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచాయని పేర్కొన్నారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలిచి, సంక్షేమ పాలనకు నూతన నిర్వచనం ఇచ్చిన నాయకుడిగా డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, మండల ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, పీఏసీఎస్ చైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ మండల, గ్రామ కమిటీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

## త్యాగాలు చేసిన ఉద్యమకారులకు అన్యాయం చేస్తే తీవ్ర ప్రతిఘటన తప్పేదు

**వలిగొండ జులై 8 మహా న్యూస్**రాష్ట్ర సాధన కోసం పోరాటాలు చేసి త్యాగాలు చేసిన ఉద్యమకారులకు అన్యాయం చేస్తే తీవ్ర ప్రతిఘటన తప్పదని మలిదశ ఉద్యమకారుడు సంగిశెట్టి క్రిస్టఫర్ అన్నారు నిజమైన ఉద్యమకారులను గుర్తించాలని జైలు జీవితాలు గడిపి కోర్టుల చుట్టూ తిరిగి ఆర్థికంగా నష్టపోయిన ఉద్యమకారులకు వెంటనే గుర్తింపు కార్డులు ఇచ్చి జార్ఖండ్ రాష్ట్రంలో అమలు చేస్తున్నట్లుగానే మన రాష్ట్రంలో అమలు చేసి

ప్రభుత్వం అన్ని రకాల ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు ఇప్పటికే ఉద్యమకారులు అనేకమంది చనిపోయారని ప్రభుత్వం నిజంగా ఉద్యమకారులకు న్యాయం చేస్తే మరో 10 సంవత్సరాలు అధికారంలో ఉండడం ఖాయమని ఆయన అన్నారు ఈ సమావేశంలో సంగిశెట్టి జనార్ధన్ అంతటి రవి శ్రీను తదితరులు ఉన్నారు



# అభివృద్ధిని చూసి ఓర్వలేక విమర్శలు

**కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గందమల అశోక్**

**యాదాద్రి భువనగిరి జూలై 8 మహా** ఆరు నెలల్లోనే ఆలేరు మున్సిపాలిటీ అభివృద్ధి చేస్తుంటే చూసి ఓర్వలేక బి ఆర్ ఎస్ నాయకులు తప్పుడు విమర్శలు చేస్తున్నారని యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గందమల్ల అశోక్, మున్సిపల్ వైస్ చైర్మన్ అంగిడి ఆంజనేయులు, కౌన్సిలర్ పస్తం ఆంజనేయులు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగర్ రెడ్డిలు అన్నారు.. బుధవారం నాడు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు.. గత పది ఏళ్లుగా చేయని అభివృద్ధి ఆరు నెలల్లో మున్సిపల్ చైర్మన్ బిజాన బాలమణి భాస్కర్ చేస్తున్నారని అభివృద్ధిని జీర్ణించుకోలేక ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పై, చైర్మన్ పై కౌన్సిలర్ల పై విమర్శలు చేయడానికి వారు ఖండించారు... వెంచర్ల వద్ద డబ్బులు వసూలు చేస్తే ఇలాంటి ఆధారాలున్నా దేనికంటే దానికి రెడీ అని ఆయన అన్నారు వార్డులలో మంచినీటి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తున్నారని, కోతులు పిచ్చి కుక్కల సమస్యలను పరిష్కరించారని వారు వివరించారు కాంగ్రెస్ కౌన్సిలర్ల మధ్య చైర్మన్ మధ్య ఇలాంటి విభేదాలు లేవని బి ఆర్ ఎస్ నాయకులు ఆరోపించినట్లు ఏ ఒక్కటి చూపించిన దేనికైనా సిద్ధమని కాంగ్రెస్ నాయకులు సవాలు విసిరారు.



## ఘనంగా వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి

నివాళి అర్పించిన కాంగ్రెస్ నాయకులు

యాదాద్రి భువనగిరి జులై 8 మహా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి 77వ జయంతిని యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు వైయస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగామ ఉపేందర్ రెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు నీలం పద్మ, మాజీ ఎంపీపీ గంధమల్ల అశోక్ మున్సిపల్ చైర్మన్ బిజాన బాలమణి భాస్కర్, వైస్ చైర్మన్ అంగడి ఆంజనేయులు, కౌన్సిలర్లు మరియమ్మ మార్కు, పస్తం ఆంజనేయులు, మల్లెల సరిత శ్రీకాంత్, జూకంటి సంపత్, జట్టు నీరజ సిద్ధులు, కోఆప్షన్ సభ్యులు చింతకింది మురళి, ఎమ్మెస్ విజయ్ కుమార్, పట్టణ అధ్యక్షులు సాగర్ రెడ్డి, నాయకులు ఎజాజ్ పలు గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# మాజీ ఎమ్మెల్యే కొమ్మిడి నర్సింహారెడ్డి పాడే మోసిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

యాదాద్రి భువనగిరి జులై 8 మహా

యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలోని కొమ్మిడి నర్సింహారెడ్డి స్వగృహానికి భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, , మాజీ మంత్రి జానారెడ్డితో కలిసి వారి పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

అనంతరం స్వర్గీయ కొమ్మిడి నర్సింహారెడ్డి అంతిమయాత్రలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొని, పాడె మోసి మాజీ ఎమ్మెల్యేకు తుది వీడ్కోలు పలికారు. రాష్ట్ర ప్రభుత్వ అధికార లాంఛనాల మధ్య వారి అంత్యక్రియలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అశ్రునివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ స్వర్గీయ కొమ్మిడి నర్సింహారెడ్డి ప్రజలకు నీతి, నిజాయితీ, నిబద్ధతతో సేవలందించిన గొప్ప ప్రజానాయకుడని కొనియాడారు. ప్రజాసేవనే పరమావధిగా భావించి, ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేసిన నాయకుడిగా ఆయన చిరస్థాయిగా ప్రజల హృదయాల్లో నిలిచిపోతారని అన్నారు.

భువనగిరి నియోజకవర్గ అభివృద్ధికి, గ్రామీణ ప్రాంతాల పురోగతికి, రైతులు, పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. రాజకీయాల్లో విలువలు, నిబద్ధత, నిరాడంబరతకు ప్రతీకగా నిలిచిన నాయకుడిగా స్వర్గీయ కొమ్మిడి నర్సింహారెడ్డి భావితరాలకు ఆదర్శప్రాయులని తెలిపారు.

తెలంగాణ తొలి దశ ఉద్యమంలో స్వర్గీయ కొమ్మిడి నర్సింహారెడ్డి కీలక పాత్ర పోషించి, ప్రత్యేక తెలంగాణ సాధన కోసం విశేషంగా కృషి చేశారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. అలాగే పేదల సంక్షేమమే లక్ష్యంగా భూదానం చేసిన గొప్ప దాతగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జానారెడ్డి , మాజీ జడ్పీ చైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డి , భువనగిరి నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అంగన్వాడి కేంద్రాల్లో ద్వారా మరిన్ని సేవలు అందేలా చూడాలి

**అదనపు కలెక్టర్ భాస్కరరావు**

**యాదాద్రి భువనగిరి జూలై 8 మహా** అంగన్వాడీ కేంద్రాల ద్వారా మరింత సేవలు అందేలా పనిచేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. బుధవారం అదనపు కలెక్టర్ ఛాంబర్ లో మహిళా, శిశు, వికలాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ భాస్కరరావు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో అంగన్వాడీ సేవలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ప్రాజెక్టు వారీగా సీడీపీఓలు, సూపర్వైజర్లు సమయపాలన పాటిస్తూ అంగన్వాడీ కేంద్రాలను క్రమం తప్పకుండా సందర్శించాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించాల్సిన అన్ని సేవలు అర్హులైన లబ్ధిదారులకు వంద శాతం చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రీస్కూల్ పిల్లలు సర్వే ప్రకారం ప్రతిరోజూ కేంద్రాలకు హాజరయ్యేలా తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించాలని, అంగన్వాడీ కార్యకలాపాల్లో పారదర్శకతను పాటించాలని తెలిపారు. పోషణ ట్రాకర్, ఎన్‌హెచ్‌టీఎస్ (ఎన్ హెచ్ టి ఎస్ ) యాప్‌లలో లబ్ధిదారుల వివరాలు ఒకే విధంగా నమోదు అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని, ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన అంగన్వాడీ భవనాల నిర్మాణ పనులను ఎంపీడీఓలు, తహసీల్దార్లతో సమన్వయం చేసుకుని వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సీడీపీఓలు, సూపర్వైజర్లు తమ నెలవారీ టూర్ డైరీలను ప్రతి నెల జిల్లా కార్యాలయానికి తప్పనిసరిగా పంపించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి శ్రీనివాస్, సీడీపీఓలు వెంకటరమణ, శైలజ, జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది, సూపర్వైజర్లు, పోషణ అభియాన్ సిబ్బంది పాల్గొన్నారు.



# అంగన్వాడి కేంద్రాల్లో ద్వారా మరిన్ని సేవలు అందేలా చూడాలి

అదనపు కలెక్టర్ భాస్కరరావు

ధర్మఘంట జులై 8 యాదాద్రి భువనగిరి

అంగన్వాడీ కేంద్రాల ద్వారా మరింత సేవలు అందేలా పనిచేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు.

బుధవారం అదనపు కలెక్టర్ ఛాంబర్ లో మహిళా, శిశు, వికలాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ భాస్కరరావు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో అంగన్వాడీ సేవలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు.ప్రాజెక్టు వారీగా సీడీపీఓలు, సూపర్వైజర్లు సమయపాలన పాటిస్తూ అంగన్వాడీ కేంద్రాలను క్రమం తప్పకుండా సందర్శించాలని ఆదేశించారు.

అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించాల్సిన అన్ని సేవలు అర్హులైన లబ్ధిదారులకు వంద శాతం చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రీస్కూల్ పిల్లలు సర్వే ప్రకారం ప్రతిరోజూ కేంద్రాలకు హాజరయ్యేలా తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించాలని, అంగన్వాడీ కార్యకలాపాల్లో పారదర్శకతను పాటించాలని తెలిపారు. పోషణ ట్రాకర్, ఎన్‌హెచ్‌టీఎస్ (ఎన్ హెచ్ టి ఎస్ ) యాప్‌లలో లబ్ధిదారుల వివరాలు ఒకే విధంగా నమోదు అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని, ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన అంగన్వాడీ భవనాల నిర్మాణ పనులను ఎంపీడీఓలు, తహసీల్దార్లతో సమన్వయం చేసుకుని వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

సీడీపీఓలు, సూపర్వైజర్లు తమ నెలవారీ టూర్ డైరీలను ప్రతి నెల జిల్లా కార్యాలయానికి తప్పనిసరిగా పంపించాలని సూచించారు.

ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి శ్రీనివాస్, సీడీపీఓలు వెంకటరమణ, శైలజ, జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది, సూపర్వైజర్లు, పోషణ అభియాన్ సిబ్బంది పాల్గొన్నారు.

# వైద్య సిబ్బందికి బీపీ, షుగర్ మిషన్లు అందజేత

**వైద్య సిబ్బందికి బీపీ, షుగర్ మిషన్లు అందజేత**



**కారేపల్లి, మహా :** కారేపల్లి మండలం బాజుమల్లాయిగూడెం గ్రామపంచాయతీ ప్రజల వైద్య పరీక్షలకు సర్పంచ్ కోరం కోటమ్మ బీపీ, షుగర్ లెవల్ పరీక్షించే మీషన్లను కొనుగోలు చేయించారు. పంచాయతీ తరుపున కొనుగోలు చేసిన యంత్రాలను బుధవారం వైద్య సిబ్బదికి అందజేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించటానికి ఈ యంత్రాలు ఎంతో ఉపయోగకరమని సర్పంచ్ కోటమ్మ తెలిపారు. వర్షకాలం నేపధ్యంలో పారిశుధ్యంపై దృష్టి పెట్టి నీరు నిల్వ లేకుండా చూస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. వైద్య పరికరాలు అందించటం పట్ల వైద్య సిబ్బంది, సర్పంచ్ కు కృతజ్ఞతలు తెలిపారు.



# విజిలెన్స్ కార్యకలాపాలపై అవగాహన

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** సింగరేణి సంస్థ విజిలెన్స్ విభాగం కోల్ ఇండియాలో విజిలెన్స్ డిపార్ట్మెంట్ల పనితీరుపై అవగాహన కల్పించటానికి సింగరేణి సంస్థ, కోల్ ఇండియా లిమిటెడ్ సంయుక్తముగా సింగరేణి సంస్థ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి.వెంకన్న జాదవ్, అధ్యక్షతన బుధవారం సింగరేణి ప్రధాన కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు సింగరేణి విజిలెన్స్ సిబ్బంది తో కోల్ ఇండియా చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బ్రజేష్ కుమార్ త్రిపాటిచే పరస్పర అవగాహన కార్యక్రమం జరిగింది. ముందుగా సింగరేణి సంస్థ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి.వెంకన్న జాదవ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సింగరేణి సంస్థ ఆవిర్భావం ఏరియాల వారీగా ఉన్న ఉపరితల భూగర్భ గనుల గురించి ఈ ఏడాది సాధించిన రికార్డు ఉత్పత్తి రవాణా టర్నోవర్ సంస్థ వృద్ధి రేటును బొగ్గు ఉత్పత్తితో పాటు వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా థర్మల్, సోలార్ రంగాల్లోకి విజయవంతంగా అడుగు పెట్టిందని వివరించారు. అనంతరం సింగరేణి సంస్థలో వివిధ అంశాలపై విజిలెన్స్ విభాగం నిర్వహించే విధి విధానాల గురించి వివరించారు. తదుపరి కోల్ ఇండియా లిమిటెడ్ లో అవలంబించే విధి విధానాలపై కోల్ ఇండియా చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బ్రజేష్ కుమార్ త్రిపాటిచే సంస్థలో పనిచేసే విజిలెన్స్ అధికారులకు ఉద్యోగులకు పరస్పర అవగాహనా కల్పించారు. సింగరేణి సంస్థలో విజిలెన్స్ విభాగం నిర్వహించే కొన్ని ప్రాముఖ్యమైన విషయాలను ప్రశంసిస్తూ అట్టి విషయాలను కోల్ ఇండియాలో అమలుపరిచేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంతే కాకుండా కోల్ ఇండియా అనుబంధ సంస్థలలో విజిలెన్స్ విభాగాలు చేపట్టిన ముఖ్యమైన కార్యకలాపాలను సింగరేణి సంస్థలో అమలుపచటం ద్వారా మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమములో కోల్ ఇండియా జిఎం(విజిలెన్స్) ఎన్.ఆర్.శ్రీవాస్తవ, జిఎం అండ్ టిఎస్ టు సివిఓ సిఐఎల్ అవినాష్ మదన్వాడ్, సింగరేణి విజిలెన్స్ హెచ్ఓడి (విజిలెన్స్)ఎస్.వి.మురళీధర్ రాజు, సింగరేణి విజిలెన్స్ అధికారులు విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ డిజిటలైజేషన్‌లో ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దు

- సర్వే పూర్తయ్యాకే దరఖాస్తు ఫారాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలి
- పాఠశాలల్లో నాణ్యమైన విద్య పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్ అంకిత్



భద్రాద్రి బ్యూరో, మహా:ఎస్ఐఆర్ డిజిటలైజేషన్‌లో ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దని సర్వే పూర్తయ్యాకే దరఖాస్తు ఫారాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని అలాగే పాఠశాలల్లో నాణ్యమైన విద్య పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు.

అన్నపురెడ్డిపల్లి మండలంలో బుధవారం జిల్లా కలెక్టర్ అంకిత్ విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా అన్నపురెడ్డిపల్లి గ్రామంలోని పోలింగ్ స్టేషన్ పరిధిలో చేపడుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పరిశీలించడంతో పాటు గుట్టగూడెం గిరిజన ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పూర్తి పారదర్శకతతో భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్ణీత గడువులోగా డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. గైర్హాజరైన ఓటర్లు ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా మారిన వారు మరణించిన ఓటర్ల వివరాలను ప్రత్యేక జాబితాల రూపంలో సిద్ధం చేసి అందజేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సర్వే పూర్తయిన అనంతరం మాత్రమే సేకరించిన దరఖాస్తు ఫారాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ధృవీకరించని లేదా అసంపూర్ణ వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అప్‌లోడ్ చేయరాదని స్పష్టం చేశారు.

ప్రజలు ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటరు వివరాలను పరిశీలించి అవసరమైన మార్పులు చేర్పులు తొలగింపులు సకాలంలో చేయించుకోవాలని సూచించారు.

అనంతరం అన్నపురెడ్డిపల్లి మండలం గుట్టగూడెం గిరిజన ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల నమోదు హాజరు విద్యాబోధన ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలపై ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం పాఠశాలలో మొత్తం 15 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. భోజన నాణ్యత పరిశుభ్రత మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్న తీరును తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు ప్రతిరోజూ పోషక విలువలు కలిగిన నాణ్యమైన పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మధ్యాహ్న భోజన నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. తరగతి గదులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థుల్లో అభ్యాస నైపుణ్యాలను పెంపొందించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుదలకు కృషి చేయాలని అన్నారు. అలాగే పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మౌలిక సదుపాయాల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ తనిఖీల్లో సంబంధిత అధికారులు, బూత్ లెవల్ అధికారులు, ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# లబ్ధిదారులకు సీఎంఆర్ చెక్కులు పంపిణీ

**కారేపల్లి, మహా:** ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న సింగరేణి(కారేపల్లి)మండలానికి చెందిన లబ్ధిదారులకు బుధవారం ఖమ్మం పట్టణంలోని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో చెక్కులు పంపిణీ చేశారు. క్యాంపు కార్యాలయం ఇన్చార్జి తుంబూరి దయాకర్ రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులు ఆర్థిక సహాయం చెక్కులను అందుకున్నారు .ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రైవేట్ ఆసుపత్రులలో ఖరీదైన వైద్యం చేపించుకొని ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఎంతోమంది పేద,మధ్యతరగతి కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఎంతో ఆసరాగా నిలుస్తుందన్నారు.ఈ అవకాశాన్ని అర్హత కలిగిన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు .ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు,వివిధ మండలాలకు చెందిన నాయకులు ,లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# నవలిమిటెడ్ ఎల్.వి.పి.ఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి వైద్య సేవలు

భద్రాద్రి కొత్తగూడెం, మహా:పాల్వంచ నవ లిమిటెడ్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా నవలిమిటెడ్, ఎల్.వి.పి.ఐ సంయుక్తంగా పాల్వంచ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మండల పరిషత్ హైస్కూల్ ఎర్రగుంట నందు బుధవారం కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథులుగా డి.వాసంతి, జిల్లా విద్యశాఖధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ హాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి మౌలిక సదుపాయలు కల్పించడంలో 'నవ' లిమిటెడ్ కృషిని కొనియాడారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియచేసారు.

ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ యన్ సురేష్ చంద్ర, ఎల్.వి.ప్రసాద్, అడ్మినిస్ట్రేటర్ సి.దేవి చంద్ర రావు, సి.ఎస్.ఆర్ మేనేజర్ సి.హెచ్.శ్రీనివాసరావు, పాఠశాల హెచ్.ఎమ్ పి.సుధారాణి, పాఠశాల సిబ్బంది,

సిఎస్.ఆర్ సిబ్బంది, నవభారత్ కంటి వైద్య సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# భివృద్ధి, సంక్షేమానికి కట్టుబడిన ప్రభుత్వం

**ప్రజల ఆశీర్వాదంతో మరింత అభివృద్ధి**
**అధికారులతో వైరా ఎమ్మెల్యే సమీక్షా**

**కారేపల్లి, మహా :** ప్రజాపాలనతో అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందిస్తున్న రేవంత్ ప్రభుత్వంకు ప్రజల ఆశీర్వాదం ఇవ్వాలని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ కోరారు. బుధవారం కారేపల్లి మండలం అప్పాయిగూడెంలో ఈనెల 10 తేదిన జరగనున్న ఆశీర్వాద సభ పై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు, అధికారుల నుండి ప్రోత్సహం అవసరమన్నారు. చింతకాని మండలం జగన్నాధపురంలో ఆశీర్వాద సభను అన్ని హంగులతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అని శాఖల నుండి స్టాల్ ఏర్పాటు చేసి అధునిక పరకరాల పరిచయం, వ్యవసాయం, ఉపాధి, మహిళ సాధికారితపై నిపుణులతో ముఖాముఖీలు, సలహాలు అందిచటం జరుగుతుందన్నారు. పంట సాయం రైతు భరోసా అందించి రైతులకు పెట్టుబడికి ఇబ్బంది లేకుండా చేసిందన్నారు. వ్యవసాయ రంగానికి కావల్సిన అన్ని అవసరాలు, మద్దతుధర, బోనస్ అందిస్తున్న ఏకైక ప్రభుత్వం రేవంత్ నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అశీర్వాద బహిరంగ సభకు అన్ని వర్గాల ప్రజలను తరలించే బాధ్యతను ప్రతి ఒక్కరు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో గిడ్డంగుల శాఖ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సోసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు, ఎంపీడీవో బీ.పద్మ, తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఎంపీవో మల్లెల రవీంద్ర ప్రసాద్, ఏపీఎం పిడమర్తి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు తోటకూరి రాంబాబు, తలారి చంద్రప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



# కారేపల్లిలో ఘనంగా వైఎస్ఆర్ జన్మదిన వేడుకలు

కారేపల్లి, మహా : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీముఖ్యమంత్రి దివంగతవైఎస్ రాజశేఖర్ రెడ్డి 77 జన్మదిన వేడుకలు సోమవారం సింగరేణి కాంగ్రెస్ మండల అధ్యక్షులు తోటకూరి రాంబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సినిమా హాల్ సెంటర్ లోని వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించిన అనంతరం కేక్ కట్ చేసి చేశారు. కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి తిరుపతిరావు ఆధ్వర్యంలో సైతం వైఎస్ జయంతిని జరిపారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి పెట్టిన పథకాలు పేదల గుండెలలో చిరస్థాయిగా నిలిచాయన్నారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ, ఉచిత కరెంట్, విద్యార్థులకు ఫీజు రియాంబర్స్ మెంట్, ఇందిరమ్మ ఇండ్లు, రూ.1 రేషన్ బియ్యం వంటి పథకాలు భారత దేశ వ్యాప్తంగా దిక్సూచిగా మారాయన్నారు. ఆయన అడుగుజాడలలో నేటి ప్రభుత్వం ప్రయణిస్తుందన్నారు. ఈకార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల, జిల్లా కార్యదర్శి బానోత్ రామ్మూర్తినాయక్, జిల్లానాయకులు తలారి చంద్రప్రకాష్, సురేందర్ మనియార్, మల్లెల నాగేశ్వరరావు, గుగులోత్ భీముడునాయక్, సూరపు రెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, సర్పంచ్ లు మేదరి వీరప్రతాఫ్ (టోనీ), బానోత్ హీరాలాల్, వాంకుడోత్ హనుమంతరావు, మాజీ ఎంపీటీసీ పెద్దబోయిన ఉమాశంకర్, హనీఫ్, నాయకులు బొల్లా రమేష్ తాజుద్దీన్, బానోత్ రూప్లనాయక్, నాగులు, చాగంటి వెంకటేశ్వర్లు ఈర్య, షఫీ, చాంద్ పాషా, వినోద్, దేవుసింగ్, యాకుబ్ అలీ, షేరు, వాంకుడోత్ గాంధీ, తొగరు శ్రీను,అజ్మీర రవి తదితరులు పాల్గొన్నారు

# ఈరీ కి నివాళ్లు ఆర్పించిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే లు

కారేపల్లి, మహా : జర్నలిస్టు అజ్మీర వీరన్న మాతృమ్మూర్తి అజ్మీ ఈరీ సంస్మరణ కార్యక్రమం బుధవారం కారేపల్లి మండలం భీక్యాతండాలో జరిగింది. ఈ కార్యక్రమానికి వైరా ఎమ్మెల్యే మాలోతు రామదాసు నాయక్ మాజీ ఎమ్మెల్యే లావుడియా రాముల నాయక్, వివిధ పార్టీల నాయకులు హాజరై ఈరీ చిత్రపటానికి పూలమాలలు వేసినివాళ్లు అర్పించారు. ఈరీ కుమారులైన జర్నలిస్టు అజ్మీర వీరన్న, ఏఐటీయుసీ నాయకులు అజ్మీర బిచ్చానాయక్, సురేష్ లను నాయకులు పరామర్శించి సానుభూతిని తెలిపారు. ఈకార్యక్రమంలో సీపీఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్య వీరభద్రం, కే.నరేంద్ర, శోభన్ నాయక్, కాంగ్రెస్ నాయకులు తోటకూరి రాంబాబు, పగడాల మంజుల, బానోత్ రామ్మూర్తి, నర్సింగ్ శ్రీనివాసరావు, సర్పంచ్ ల సంఘం మండల అధ్యక్షులు భూక్య రంజిత్ కుమార్, బీఆర్ఎస్ నాయకులు లాకావత్ గిరిబాబు, హన్మకొండ రమేష్, బత్తుల శ్రీనివాస్, జాల సాంబ, నాయకులు బోల్ల రమేష్,ఆదెర్ల రాములు, ఎండీ హనీఫ్, వాచ్యా, చాంది తదితరులు పాల్గొన్నారు



# బెల్లంపల్లి లో ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు

**బెల్లంపల్లి, మహా:** దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలను బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదేశాల మేరకు బుధవారం నాడు బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పెద్ద ఎత్తున వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా కేక్ కట్ చేసి పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకుల కార్యకర్తల సమక్షంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టిపిసిసి జనరల్ సెక్రెటరీ ప్రభుత్వ అబ్జర్వర్ రాజేష్ హాజరై రాజశేఖర్ రెడ్డి చేసిన పథకాలను వివరిస్తూ అతని ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి మున్సిపాలిటీ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు ఎస్సీ సెల్ నాయకులు,బీసీ సెల్ నాయకులు మైనార్టీ నాయకులు మహిళా నాయకురాలు యూత్ కాంగ్రెస్ నాయకులు 34 వార్డుల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పార్టీ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# పేరుకే సర్కార్ దవాఖాన.. సమస్యలతో సతమతం

- ఆసుపత్రికి డాక్టర్ల కొరత
- మందుల సప్లై చేయక రోగులు ఇబ్బందులు
- రక్త పరీక్షలు సరిగ్గా చేయక ప్రజల ఆవేదన
- సిపిఎం సర్వేలో అనేక సమస్యలు వెలుగులోకి
- సమస్యల తీరును వివరించిన సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు



**భద్రాద్రి బ్యూరో, మహా:** పేరుకే సర్కార్ దవాఖాన నిలిచిందని అనేక సమస్యలు ఆసుపత్రిలో నెలకొని ఉన్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక జిల్లా కేంద్ర ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లో ఇటీవల సిపిఎం బృందం సర్వే నిర్వహించింది. ఈ సందర్భంగా హాస్పిటల్ లో ఉన్న సమస్యలు కుప్పలు తెప్పలుగా వెలుగులోకి వచ్చాయని బుధవారం సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు తెలియజేశారు. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లో గుండె కిడ్నీ నరాల సంబంధించిన డాక్టర్ల లేరని అసలు ఆ విభాగమే హాస్పిటల్ లో పనిచేయడం లేదని ఆయన అన్నారు. దీనివలన గుండె కిడ్నీ నరాలకు సంబంధించిన సమస్య వస్తే ప్రజలు ఖమ్మం గాని హైదరాబాదు లాంటి సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నెలల నుండి హాస్పిటల్ కి సిరంజీల సప్లై లేదని దీనివలన ప్రైవేటు మెడికల్ షాప్ లను ఆశ్రయించి డబ్బులతో మెడిసిన్ సిరంజీలు కొనుగోలు చేయాల్సి వస్తుందని అన్నారు. తాము సర్వే చేసిన రోజున సిరంజీలు లేవని రక్త పరీక్షలు కూడా చేయకుండా రోగులను వెనక్కి పంపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.డాక్టర్ అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని 173 డాక్టర్ పోస్టులకు గాను కేవలం 40 మంది మాత్రమే ఉన్నారని వీరిలో 15 మంది తాత్కాలిక డాక్టర్లు మాత్రమే ఉన్నారని తెలిపారు. జిల్లా కేంద్రం హాస్పిటల్ లో డాక్టర్ల కొరత ఈ విధంగా ఉంటే ఏజెన్సీ ప్రజలకు మెరుగైన వైద్యం ఎలా అందుతుందని ఆయన ప్రశ్నించారు. అంబులెన్స్లు ఐదు అవసరం కాగా కేవలం రెండు అంబులెన్స్ మాత్రమే పనిచేస్తున్నాయని దీనివలన అత్యవసర పరిస్థితుల్లో రోగులు హాస్పిటల్ కి రావాలంటే తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. హాస్పిటల్లో మంచినీటి సౌకర్యం సక్రమంగా లేదని హాస్పిటల్ విస్తరించిన తర్వాత హాస్పిటల్ డ్రైనేజీ వాటర్ బయటకు వెళ్లాలంటే ఇబ్బందులు ఏర్పడి మురుగునీరు నిల్వ ఉండి హాస్పిటల్ చుట్టుపక్కల రోడ్లమీదకు వస్తున్నాయని దీనివలన హాస్పిటల్ పరిసర ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆరోపించారు. తక్షణమే డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. చర్మ వ్యాధులు కంటి వైద్యానికి సంబంధించి ఒక చిన్న రూమ్ లో ఓపి ఏర్పాటు చేశారని దీని వలన పేషెంట్లు అలాగే డాక్టర్ కూడా ఇబ్బంది పడుతున్నారని ఇది తమ దృష్టికి వచ్చినట్లు తెలియజేశారు. రోజుకు సుమారు ఆరు వందల మంది ప్రజలు హాస్పిటల్ కి వస్తుండగా నడవడం చేతకాని వారిని స్ట్రెచ్చర్ మీద తీసుకెళ్లాలంటే అంత పెద్ద హాస్పిటల్ లో కేవలం మూడు స్ట్రెచ్చర్స్ మాత్రమే ఉన్నాయని అన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు భర్తీ చేయకపోవడం వలన రక్త పరీక్షలు సిటీ స్కానింగ్ వంటి పరీక్షలు చేయడానికి డాక్టర్ల కొరత ఏర్పడిందని దీనివలన సౌకర్యాలు ఉన్న వాటిను ఉపయోగించలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. మెడికల్ కాలేజీకి అనుబంధంగా నిర్మించే హాస్పిటల్ నిర్మాణం నత్తనడకన నడుస్తుందని తెలిపారు. తక్షణమే నూతన భవన నిర్మాణాన్ని పూర్తిచేసి మెడికల్ కాలేజీ కనుబంధంగా నూతన జిల్లా కేంద్ర ఆసుపత్రిని ప్రారంభించాలని డిమాండ్ చేశారు.తక్షణమే హాస్పిటల్ సమస్యలు పరిష్కారానికి నిధులు కేటాయించి మౌలిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ వైద్య రంగాన్ని పట్టించుకోని జిల్లా మంత్రులు జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉండి కూడా జిల్లా కేంద్ర ఆసుపత్రిని అభివృద్ధి చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య విమర్శించారు. కొత్తగా వచ్చిన జిల్లా కలెక్టర్లు హాస్పిటల్ సందర్శించుతున్నారు తప్ప సమస్యకు పరిష్కారం చూపట్లేదని ఆయన ఆరోపించారు. వైద్య విధాన పరిషత్ నుండి డిఎంఈ పరిధిలోకి వచ్చినప్పటికీ పేరు మార్పే తప్ప సౌకర్యాలలో అభివృద్ధి మాత్రం కనబడడం లేదని విమర్శించారు.

వర్షా కాలంలో సీజనల్ వ్యాధుల నుండి ప్రజలను కాపాడడానికి సరైన వైద్య సదుపాయం అందించాలని మందులు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ లిక్కి బాలరాజు జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్ కార్యదర్శివర్గ సభ్యులు నందిపాటి రమేష్ టౌన్ కమిటీ సభ్యురాలు అన్నవరపు ఇందిరా నాయకులు బాలకృష్ణ రాములు రఘు, నాగమణి రేణుక సలీం తదితరులు పాల్గొన్నారు.




# పవన్ కల్యాణ్ వీరాభిమాని నిరంజన్‌కు ఆల్బమ్ అంకితం

సినిమాలకు ఊరమాస్ మ్యూజిక్ అందిస్తూ, రీసెంట్ టైమ్స్‌లో పవన్ కల్యాణ్ ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు బ్యాక్‌బోన్‌గా నిలిచిన స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్. ఎస్. థమన్ మరోసారి తన పెద్ద మనసును చాటుకున్నారు. త్వరలోనే రాబోతున్న మోస్ట్ అవైటెడ్ సీక్వెల్ 'OG 2' మ్యూజిక్ ఆల్బమ్‌ను దివంగత పవన్ కల్యాణ్ వీరాభిమాని నిరంజన్‌కు అంకితం ఇస్తున్నట్లు థమన్ అధికారికంగా ప్రకటించారు. సాధారణంగా పెద్ద పెద్ద సినిమాల ఆల్బమ్స్ లేదా పాటలను అగ్ర నటులకో, దర్శకులకో లేదా పరిశ్రమకు చెందిన ప్రముఖులకో అంకితం ఇవ్వడం మనం చూస్తుంటాం కానీ థమన్ ఒక అడుగు ముందుకు వేసి, పవన్ కల్యాణ్ అంటే ప్రాణమిచ్చే ఒక సామాన్య అభిమానికి ఈ గౌరవాన్ని దక్కించారు. నిరంజన్ అనే పవన్ కల్యాణ్ హార్డ్‌కోర్ ఫ్యాన్ ఇటీవలే అకాల మరణం చెందారు. ఈ మధ్యకాలంలో పవన్ కల్యాణ్ ఆ చిన్నారి దగ్గరకు వెళ్లి అతనితో కాస్త క్వాలిటీ టైం స్పెండ్ చేసి వచ్చారు. పవన్ శ్రేయోభిలాషిని, పవన్ ఆర్మీలో ఒక బలమైన సైనికుడిని కోల్పోవడం పట్ల థమన్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. కేవలం ఒక అభిమానిగానే కాకుండా, తమ జర్నీలో భాగమైన ఒక కుటుంబ సభ్యుడిని కోల్పోయినంతగా థమన్ ఎమోషనల్ అయ్యారు. దర్శకుడు సుజీత్ - పవన్ కల్యాణ్ కాంబినేషన్‌లో వస్తున్న 'OG' సిరీస్‌పై టాలీవుడ్‌లో ఏ స్థాయి అంచనాలు ఉన్నాయో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ముఖ్యంగా థమన్ అందించే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కోసం ఫ్యాన్స్ కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. ఇంతటి భారీ క్రేజ్ ఉన్న '#OG2' ఆల్బమ్‌ను నిరంజన్ జ్ఞాపకార్థం అంకితం ఇవ్వడం ద్వారా, ఆ అభిమాని పేరు పవన్ కల్యాణ్ కెరీర్‌లోనే ఒక మైలురాయి లాంటి ప్రాజెక్ట్‌తో ఎప్పటికీ నిలిచిపోనుంది.



బన్నీలోకేష్ సినిమా..

# లుక్ టెస్ట్ పూర్తి

**AA23పై భారీ అంచనాలు.. త్వరలో బీటీఎస్ వీడియో విడుదల**

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ దర్శకుడు లోకేష్ కనగరాజ్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న ప్రతిష్టాత్మక చిత్రం **AA23**పై అభిమానుల్లో రోజురోజుకూ ఆసక్తి పెరుగుతోంది. ఈ ప్రాజెక్ట్ ఎప్పుడు సెట్స్‌పైకి వెళ్తుందా అని ఎదురుచూస్తున్న ఫ్యాన్స్‌కు మేకర్స్ అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చారు. సినిమాకు సంబంధించిన లుక్ టెస్ట్ విజయవంతంగా పూర్తయిందని అధికారికంగా ప్రకటించారు. దీంతో ఈ చిత్రంపై అంచనాలు మరింత పెరిగాయి.

లుక్ టెస్ట్ సందర్భంగా అల్లు అర్జున్‌ను పూర్తిగా కొత్త అవతారంలో తీర్చిదిద్దినట్లు సమాచారం. ఇప్పటివరకు ఆయన కనిపించని కొత్త లుక్, భిన్నమైన బాడీ లాంగ్వేజ్‌తో ఈ సినిమాలో కనిపించనున్నారని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. పాత్ర కోసం బన్నీ ప్రత్యేకంగా సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

యాక్షన్ సినిమాలను అత్యంత స్టైలిష్‌గా, పవర్‌ఫుల్‌గా తెరకెక్కించే దర్శకుడిగా లోకేష్ కనగరాజ్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. తన సినిమాల్లో హీరోలను వైల్డ్, ఇంటెన్స్‌గా చూపించే ఆయన.. బన్నీని ఎలా ప్రజెంట్ చేయబోతున్నారనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. ఈ లుక్ టెస్ట్ కూడా సినిమా రూపకల్పనలో కీలక ఘట్టంగా భావిస్తున్నారు.

లుక్ టెస్ట్ సందర్భంగా చిత్రీకరించిన బిహైండ్ ది సీన్స్ (BTS) వీడియోను త్వరలో విడుదల చేయాలని మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో అల్లు అర్జున్, లోకేష్ కనగరాజ్ మధ్య వర్కింగ్ స్టైల్, సెట్స్ రూపకల్పన, సినిమా కోసం జరుగుతున్న సన్నాహాలపై అభిమానులకు ప్రత్యేకంగా చూపించనున్నట్లు సమాచారం.

పుష్ప2 విజయంతో గ్లోబల్ స్టార్‌గా ఎదిగిన అల్లు అర్జున్.. ఇప్పుడు లోకేష్ సినిమాటిక్ యూనివర్స్‌లో అడుగుపెడుతుండటం ఈ ప్రాజెక్ట్‌కు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది. భారీ యాక్షన్ సన్నివేశాలు, అత్యాధునిక సాంకేతిక ప్రమాణాలు, లోకేష్ మార్క్ స్క్రీన్‌ప్లేతో ఈ చిత్రం రూపొందనుంది. బన్నీ స్టైల్, లోకేష్ మేకింగ్ కలయిక బాక్సాఫీస్ వద్ద మరో సంచలనాన్ని సృష్టిస్తుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

◌స్తుతం అల్లు అర్జున్, దర్శకుడు అట్లీ తెరకెక్కిస్తున్న రాకా చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ డిసెంబర్ నాటికి పూర్తయ్యే అవకాశం ఉందని సమాచారం. ఆ తర్వాత వెంటనే బన్నీ AA23

షూటింగ్‌లో పాల్గొననున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే లోకేష్ ప్రీప్రొడక్షన్ పనులను వేగంగా పూర్తి చేస్తుండగా, సెట్స్‌పైకి వెళ్లే వరకు వరుస అప్‌డేట్‌లతో అభిమానులను అలరించేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నారు.

# టాలీవుడ్‌పై సోనాలి ప్రశంసలు

**ప్రణాళిక, నిర్మాణ విలువలు అద్భుతం.. మరోసారి తెలుగు సినిమాలో నటిస్తా**



బాలీవుడ్ స్టార్ నటి సోనాలి బింద్రే టాలీవుడ్‌పై మరోసారి ప్రశంసల వర్షం కురిపించారు. హిందీ, తెలుగు చిత్ర పరిశ్రమల్లో పనిచేసిన అనుభవంతో ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా తెలుగు చిత్ర పరిశ్రమలో ఉండే క్రమశిక్షణ, ముందస్తు ప్రణాళిక, నిర్మాణ విలువలు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని ఆమె పేర్కొన్నారు. ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన సోనాలి బింద్రే.. టాలీవుడ్‌లో సినిమా ప్రారంభానికి ముందే కథ, స్క్రీన్‌ప్లే, షూటింగ్ షెడ్యూల్ వంటి అన్ని అంశాలు స్పష్టంగా సిద్ధంగా ఉంటాయని చెప్పారు. దీంతో చిత్రీకరణ ప్రణాళిక ప్రకారం సజావుగా సాగి, నిర్ణయించిన సమయానికే పూర్తవుతుందని వివరించారు. ప్రతి విభాగం సమన్వయంతో పనిచేయడం వల్ల సెట్స్‌పై గందరగోళానికి తావుండదని ఆమె అభిప్రాయపడ్డారు.

అదే సమయంలో బాలీవుడ్‌లో మాత్రం కొన్ని సందర్భాల్లో చివరి నిమిషంలో కథ, సన్నివేశాల్లో మార్పులు జరుగుతుంటాయని, దాని ప్రభావం షూటింగ్ షెడ్యూళ్లపై పడుతుందని తెలిపారు. టాలీవుడ్‌లో ముందస్తు ప్రణాళికకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వడం వల్ల నిర్మాతలు, దర్శకులు, నటీనటులు, సాంకేతిక నిపుణులందరికీ పని మరింత సులభంగా ఉంటుందని చెప్పారు.

నిర్మాణ విలువల విషయంలో కూడా తెలుగు సినిమా పరిశ్రమ గత కొన్నేళ్లలో విశేషంగా ఎదిగిందని సోనాలి పేర్కొన్నారు. కథకు అవసరమైన స్థాయిలో ఖర్చు పెట్టేందుకు నిర్మాతలు వెనుకాడరని, సాంకేతిక ప్రమాణాలు అంతర్జాతీయ స్థాయికి చేరుకున్నాయని అన్నారు. అలాగే సెట్స్‌లో కళాకారులు, టెక్నీషియన్లకు ఇచ్చే గౌరవం, ఆతిథ్యం టాలీవుడ్ ప్రత్యేకతల్లో ఒకటని కొనియాడారు.

తెలుగు ప్రేక్షకులతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్న సోనాలి.. తాను నటించిన సినిమాల వల్లే ఇప్పటికీ అభిమానులు చూపిస్తున్న ప్రేమను ఎప్పటికీ మర్చిపోలేనని చెప్పారు. గ్లామర్ పాత్రలతో పాటు నటనకు ప్రాధాన్యమున్న పాత్రలు కూడా తెలుగు చిత్రాల్లో చేయడం తనకు ప్రత్యేక అనుభూతినిచ్చిందని తెలిపారు.

క్యాన్సర్‌ను జయించి తిరిగి జీవితంలో ముందుకు సాగుతున్న సోనాలి బింద్రే.. ప్రస్తుతం ఎంపిక చేసిన పాత్రల్లోనే నటిస్తున్నట్లు వెల్లడించారు. అయితే మంచి కథ, బలమైన పాత్ర లభిస్తే మరోసారి తెలుగు సినిమాలో నటించేందుకు సిద్ధమేనని సంకేతాలు ఇచ్చారు. ఆమె వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, మరోసారి సోనాలిని టాలీవుడ్ తెరపై చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# కొత్త ఆరంభానికి సిద్ధమైన రవి మోహన్

**అభిమానులకు క్షమాపణ.. సినిమాలపైనే ఇక పూర్తి దృష్టి**

కోలీవుడ్ స్టార్ రవి మోహన్ (జయం రవి) మరోసారి తన సినీ ప్రయాణాన్ని కొత్త ఉత్సాహంతో ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. గత కొంతకాలంగా వ్యక్తిగత జీవితానికి సంబంధించిన వివాదాలతో వార్తల్లో నిలిచిన ఆయన.. ఇప్పుడు వాటన్నింటికీ ముగింపు పలుకుతూ కెరీర్‌పైనే పూర్తి స్థాయిలో దృష్టి పెట్టనున్నట్లు ప్రకటించారు. ఒక సినీ కార్యక్రమంలో భావోద్వేగ ప్రసంగం చేసిన రవి మోహన్.. గతంలో తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటూ అభిమానులకు బహిరంగంగా క్షమాపణ చెప్పారు. కొంతకాలం క్రితం వ్యక్తిగత కారణాల వల్ల సినిమాలకు దూరంగా ఉండాలని భావించిన రవి మోహన్.. ఇప్పుడు ఆ నిర్ణయాన్ని మార్చుకున్నట్లు వెల్లడించారు. తన జీవితంలో ఒక క్లిష్టమైన దశ ముగిసిందని, ఇక నుంచి కొత్త అధ్యాయాన్ని ప్రారంభిస్తున్నానని తెలిపారు. "ఇది నాకు రెండో జన్మ లాంటిది. గతాన్ని వెనక్కి వదిలేసి, నటుడిగా మరింత మంచి సినిమాలు చేయడమే నా లక్ష్యం" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు అభిమానులను ఆకట్టుకున్నాయి.

గత కొన్ని నెలలుగా రవి మోహన్ వ్యక్తిగత జీవితం తీవ్ర చర్చనీయాంశమైంది. భార్య ఆర్తితో ఏర్పడిన విభేదాలు, అనంతరం గాయని కెనీషాతో ఆయన పేరు వినిపించడం, సోషల్ మీడియాలో వచ్చిన ట్రోలింగ్, విమర్శలు పెద్ద ఎత్తున చర్చకు దారితీశాయి. ఈ పరిణామాలపై ఒక దశలో మీడియా ముందుకు వచ్చిన రవి.. తనపై, కెనీషాపై వస్తున్న ఆరోపణలకు వివరణ ఇచ్చారు. ఆ తర్వాత మాత్రం పూర్తిగా మీడియాకు దూరంగా ఉంటూ కొత్త సినిమాల గురించి కూడా ఎలాంటి ప్రకటనలు చేయలేదు. దీంతో ఆయన సినీ భవిష్యత్తుపై అనేక ఊహాగానాలు వినిపించాయి. అయితే తాజాగా చేసిన ప్రకటనతో వాటన్నింటికీ చెక్ పెట్టిన రవి మోహన్.. ఇకపై పూర్తిగా సినిమాలపైనే దృష్టిసారించనున్నట్లు స్పష్టం చేశారు. తన ప్రసంగంలో ఇప్పటివరకు చేసిన గుర్తుండిపోయే పాత్రలను గుర్తు చేసుకున్న ఆయన.. భవిష్యత్తులో కూడా ప్రేక్షకుల మన్ననలు పొందే పాత్రలనే ఎంపిక చేసుకోవాలని భావిస్తున్నట్లు చెప్పారు. గతాన్ని తలచుకుని బాధపడటం కంటే కొత్త లక్ష్యాలతో ముందుకు సాగడమే తన నిర్ణయమని వెల్లడించారు.

ఇక రవి మోహన్ రీఎంట్రీకి ఆయన స్వీయ నిర్మాణంలో రూపొందుతున్న 'బ్రో కోడ్' చిత్రం వేదిక కానుంది. ఈ సినిమాలో తెలుగమ్మాయి శ్రీ గౌరీ ప్రియ కథానాయికగా నటిస్తోంది. వ్యక్తిగత జీవితంలో ఎదురైన ఒడిదుడుకులను దాటుకుని కొత్త ఉత్సాహంతో కెరీర్‌ను కొనసాగించేందుకు సిద్ధమైన రవి మోహన్‌కు అభిమానులు ఎలాంటి స్వాగతం పలుకుతారో చూడాలి. సినీ వర్గాల్లో కూడా ఆయన కొత్త ఇన్నింగ్స్‌పై ఆసక్తికర చర్చ సాగుతోంది.



# మెరిసిపోతున్న నైరా బెనర్జీ



**గ్లామర్ లుక్‌తో అభిమానులను ఆకట్టుకున్న భామ**

తెలుగు, హిందీ, తమిళ చిత్రాల్లో తనదైన నటనతో గుర్తింపు తెచ్చుకున్న నటి నైరా ఎం బెనర్జీ (నైరా బెనర్జీ) మరోసారి తన గ్లామర్ లుక్‌తో సోషల్ మీడియాలో సందడి చేస్తోంది. రియాలిటీ షోలు, సూపర్‌నేచురల్ డ్రామాలు, వెబ్ ప్రాజెక్టులతో ప్రేక్షకులకు దగ్గరైన ఈ భామ.. ఇప్పుడు స్టైలిష్ ఫోటోషూట్‌తో అభిమానుల ప్రశంసలు అందుకుంటోంది.

తాజాగా నైరా తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఫొటోలు నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. బహురంగుల సీక్విన్ డిజైన్‌తో రూపొందించిన స్టైలిష్ అవుట్‌ఫిట్‌లో ఆమె మెరిసిపోయింది. ఆరెంజ్, పింక్, గోల్డ్ రంగుల కలయికలో ఉన్న డ్రెస్‌కు థైహై స్లిట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వేవీ హెయిర్ స్టైల్, గ్లామరస్ మేకప్, మనోహరమైన చిరునవ్వుతో కెమెరాకు ఇచ్చిన పోజులు హైఫ్యాషన్ లుక్‌ను తలపిస్తున్నాయి. సాధారణ బ్యాక్‌డ్రాప్‌లోనూ ఆమె స్టైలింగ్ ప్రత్యేకంగా కనిపిస్తోంది.

సినిమాల విషయానికి వస్తే.. నైరా ప్రస్తుతం 'వన్ టూ చా చా చా' (2026) అనే పాన్ ఇండియా హిందీ కామెడీఅడ్వెంచర్ చిత్రంలో ప్రధాన పాత్రలో నటిస్తోంది. ఇందులో ఆమె 'షోమా' పాత్రను పోషిస్తుండగా, ప్రముఖ నటుడు అశుతోష్ రాణా కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం ద్వారా నైరా మరోసారి తన నటనతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది.

గ్లామర్, నటన రెండింటినీ సమతూకంగా కొనసాగిస్తున్న నైరా బెనర్జీ.. ప్రతి కొత్త ఫోటోషూట్‌తో పాటు తన సినిమా అప్‌డేట్‌లతో కూడా అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ప్రస్తుతం ఆమె తాజా ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com